గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తాం
» కిష్టారం వాసుల నిరవధిక దీక్షకు బీజేపీ మద్దతు 6

'రైతు భరోసా' తీరుపై భట్టి ఆరా
» చర్చనీయాంశంగా మారిన ఆంధ్రజ్యోతి కథనం 7


ఖమ్మం నగరంలో ర్యాలీ

జయహో ఛత్రపతి

హోరెత్తిన శివాజీ మహారాజ్ ర్యాలీ

ఛత్రపతి శివాజీ మహారాజ్ పుట్టినరోజును పురస్కరించుకొని ఖమ్మం నగరం బుధవారం రాత్రి హోరెత్తింది. హిందూ వాహిని ఆధ్వర్యంలో పెవిలియన్ గ్రౌండ్ నుంచి జమ్మిబండ వరకు భారీ ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ, హిందూ సంఘాల నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాషాయ జెండాల రెపరెపల మధ్య వాహనంలో శివాజీ విగ్రహాన్ని ఉంచి ఉద్వేగంగా ఊరేగించారు. నినాదాలు మార్మోగగా, నృత్యాలు హోరెత్తాయి.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం ఖానాపురం హవేలి


ర్యాలీలో శివాజీ చిత్రపటంతో యువత

నా చావుకు కారణం
ఆ ఇద్దరే..

- సెల్ఫీ వీడియోలో ఓ వ్యక్తి ఆరోపణ
- పురుగుల మందు కలిపిన మద్యం తాగి ఆత్మహత్యాయత్నం
- తన భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని వెల్లడి
- పోలీసుల తీరు కూడా కారణమని ఆరోపణ
- మణుగూరులో కలకలం.. వాంగ్మూలం తీసుకున్న న్యాయాధికారి

మణుగూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో కలహాలు సృష్టించడమే కాకుండా తన భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని, పోలీసులు కూడా ఆమెకే వత్తాసు పలుకుతున్నారని ఆరోపిస్తూ ఓ వ్యక్తి మద్యంలో గడ్డి మందు కలుపుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన భద్రాద్రి జిల్లా మణుగూరులో చోటు చేసుకుంది. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న సదరు వ్యక్తి నుంచి మణుగూరు కోర్టు న్యాయాధికారి బుధవారం వాంగ్మూలం తీసుకున్నారు. ఆత్మహత్యాయత్నానికి ముందు బాధితుడు మంగళవారం తన గోడును వీడియోలో రికార్డు చేశాడు. వివరాల్లోకి వెళ్లితే..

మణుగూరులోని శివలింగాపురం గ్రామానికి చెందిన వ్యక్తి ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. ఇతనికి కొత్తగూడెం రుద్రంపూర్ ప్రాంతానికి చెందిన యువతితో వివాహమైంది. వీరికి ఐదు, మూడేళ్ల వయసు గల ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతేడాది నుంచి వీరి కుటుంబంలో (మిగతా 6వ పేజీలో)



కాగితం కర్రకు కష్టకాలం

రోజు రోజుకూ పతనమవుతున్న ధరలు

గడిచిన మూడేళ్లలో ఆశాజనకంగా ఉన్న జామాయిల్, సుబాబుల్ ధరలు క్రమంగా తగ్గుముఖం పడుతుండడంతో కర్ర రైతులు ఆందోళన చెందుతున్నారు. పేపర్ తయారీకి కీలకమైన జామాయిల్, సుబాబుల్ కలపకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంది. విదేశాల నుంచి అధిక ధరకు కర్రను దిగుమతి చేసుకుంటున్న పేపర్ మిల్లు యాజమాన్యాలు ఆ ఖర్చు భారాన్ని తగ్గించుకునేందుకు రెండు దశాబ్దాలుగా స్థానిక రైతులను ప్రోత్సహించి మొక్కలు అందించి జామాయిల్, సుబాబుల్ సాగును విస్తరించారు. ఫలితంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు లక్షన్నర ఎకరాల్లో జామాయిల్, సుబాబుల్ సాగవుతోంది. ఖమ్మంజిల్లాలో అత్యధికంగా సుబాబుల్ సాగవుతుండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జామాయిల్ సాగవుతోంది. అనేకమంది రైతులు పత్తి, మిర్చి వంటి వాణిజ్యపంటలను పక్కనబెట్టి జామాయిల్, సుబాబుల్‌ను ప్రత్యామ్నాయ పంటగా సాగు చేస్తున్నారు. పోడు భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వడంతో గిరిజన రైతులు కూడా అయా భూముల్లో జామాయిల్, సుబాబుల్ సాగు చేపట్టారు.

- ఆందోళనలో జామాయిల్, సుబాబుల్ రైతులు
- వాణిజ్య పంటలకు ప్రత్యామ్నాయంగా సాగు
- పేపర్ మిల్లు యాజమాన్యాల సిండికేట్?
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వినతి
- టన్నుకు రూ.10వేల ధర ఇవ్వాలని డిమాండ్

ఖమ్మం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గతంలో కొంతకాలం జామాయిల్, సుబాబుల్ ధరలు తగ్గినప్పుడు ప్రత్యామ్నాయంగా పామాయిల్ సాగుపై రైతులు దృష్టిపెట్టారు. చాలామంది రైతులు 'కర్ర' తోటలు తీసి పామాయిల్ వేస్తుండడంతో పేపర్‌మిల్లు యాజమాన్యాలు ఆందోళన చెందాయి. దాంతో పూర్తిగా రైతుల పంట పొలాల్లో సాగుచేస్తున్న కలపను ఆధారంగా చేసుకుని పేపర్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి ఐటీసీ భద్రాచలం పేపర్‌మిల్లు, రాజమండ్రి పేపర్‌మిల్లు, బలార్షా పేపర్‌మిల్లు రాయగడ్ జేకే పేపర్‌మిల్లు యాజమాన్యాలు పోటీపడి ఇటీవలి వరకు జామాయిల్, సుబాబుల్ కొనుగోలు చేశారు. జనవరి 15 వరకు తొక్కతీసిన జామాయిల్ కర్ర టన్ను రూ.8,900నుంచి రూ.9,800వరకు, తొక్కతీసిన సుబాబుల్ టన్ను రూ.8500నుంచి రూ.9వేలకు పైగా ధర చెల్లించి కొనుగోలు చేశారు. గత ఆరునెలలుగా పేపర్ మిల్లు యాజమాన్యాల మధ్య పోటీ ఉండడంతో కలప ధర క్రమంగా పెరగడంతో రైతులు లాభాలు చూశారు. మూడు నుంచి ఐదేళ్ల సాగులో ఉన్న జామాయిల్, సుబాబుల్ రైతులకు ఎకరానికి 25 నుంచి 50 టన్నుల కలప దిగుబడి వస్తోంది. ఖర్చులన్నీ పోను రైతుకు టన్నుకు రూ.7,500వరకు మిగులుతుండడంతో రైతులు జామాయిల్, సుబాబుల్ పట్ల ఆసక్తితో మళ్లీ తోటలు వేయడం ప్రారంభించారు.

పేపర్ మిల్లుల సిండికేట్?

గత ఆరు నెలలుగా తోటలు క్రమంగా పెరగడంతో పేపర్‌మిల్లు యాజమాన్యాలు పోటీని పక్కనెట్టి సిండికేట్ అయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో టన్నుకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు (మిగతా 6వ పేజీలో)

ధర తగ్గకుండా చర్యలు తీసుకోవాలి
వేములపల్లి సుధీర్, జామాయిల్ రైతు



రాష్ట్ర ప్రభుత్వం జామాయిల్, సుబాబుల్ రైతులకు నష్టం జరగకుండా చూడాలి. పేపర్ మిల్లు యాజమాన్యాలు సిండికేట్ అయి ధర తగ్గిస్తున్నాయి టన్నుకు రూ.10వేలు ధర వస్తుందనుకుంటే సిండికేట్‌గా మారి టన్నుకు రూ.2వేల వరకు ధర తగ్గించారు. అటవీశాఖకు సం బంధించిన జామాయిల్, సుబాబుల్ కలపను ఐటీసీ బీపీఎల్ టన్నుకు రూ.11,150 లకు కొంటూ అదే రైతులు పండించిన కలపకు టన్నుకు రూ.8వేలే ఇస్తున్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి. పేపర్‌మిల్లు యాజమాన్యాలను పిలిపించి మాట్లాడాలి.

ఎండల వేళ
జాగ్రత్త.. జాగ్రత్త...

- వడదెబ్బ బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలి
- అవసరమైన చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి
- హైరిస్క్ ఏరియాలను గుర్తించాలి...
- టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఇతర అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం కల్పించాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో వేసవి వడగాలుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి వైద్యశాఖ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సారి జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని, గతేడాది దాదాపు 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని కలెక్టర్ తెలిపారు. లేబర్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, డీఆర్డీవో రెవెన్యూ ఆధ్వర్యంలో ఎండ తీవ్రతను ఎదుర్కొనే ప్రజల వివరాలు సేకరించాలని, అధికంగా ఎండలో పనిచేసే వృత్తుల వారీగా ఆ వివరాలు ఉండాలని కలెక్టర్ తెలిపారు. నిర్మాణ కార్మికులు, రోజువారీ కూలి, ఉపాధి హామీ కూలీలు, పారిశుధ్య కార్మికుల వివరాలు సేకరించాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వడదెబ్బ తగిలే హైరిస్క్ ఏరియాలు ఎక్కడ ఉన్నాయో గుర్తించాలన్నారు.

వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగే వివిధ పంట కొనుగోలు నేపథ్యంలో రైతులకు, హమాలీ కూలీలకు, సిబ్బందికి వడదెబ్బ తగలకుండా ఏర్పాట్లు ఉండాలని, అవసరమైన టెంట్, తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ తెలిపారు. ఉపాధి హామీ పనులు జరిగే చోట అవసరమైన నీడ, కూలీలకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. నీటిపారుదల, పంచాయతీ, వివిధ శాఖల కింద జరిగే పనులు దగ్గర కార్మికులకు వడదెబ్బ తగలకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్, ప్రతీ తహసీల్దార్, మునిసిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో చలి వేంద్రాలు (మిగతా 6వ పేజీలో)


కొత్తగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

కేంద్రానిది ప్రజా వ్యతిరేక బడ్జెట్
» కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే ఊరుకోం
» ప్రైవేటీకరణకు తక్షణమే స్వస్తి చెప్పాలి 6
» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఆరోగ్యమస్తు...



- బీపీ, షుగర్ వ్యాధుల గుర్తింపునకు నేటి నుంచి ఇంటింటి సర్వే
- 30 ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ రికార్డు
- ఏర్పాట్లు పూర్తి చేసిన వైద్య ఆరోగ్య శాఖ

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ఆరోగ్య సర్వే చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 30 ఏళ్ల దాటిన ప్రతీ ఒక్కరికీ బీపీ, షుగర్ వ్యాధులపై సర్వే నిర్వహించనున్నారు. గ్రామాల వారీగా ప్రతీ ఒక్కరికి హెల్త్‌ప్రొఫైల్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర సర్కారు ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం గ్రామాల బాట పట్టనున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి కుటుంబంలో 30ఏళ్ల దాటిన వారు ఎంతమంది ఉన్నారో వారందరి ఆరోగ్య వివరాలను వైద్య సిబ్బంది సేకరించనున్నారు. దీని ద్వారా వ్యాధుల తీవ్రత ఆధారంగా చికిత్సకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది.

- రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్‌తోపాటు గుండెపోటు, హృద్రోగ సంబంధ, నరాల సమస్యలు, ఫిట్స్, వైకల్యం, దీర్ఘకాలిక తలనొప్పి, కండరాల నొప్పులు ఉన్నాయా..? అని సిబ్బంది ఆరా తీయనున్నారు. మద్యం, ధూమపానం తదితర అలవాట్లను తెలుసుకోనున్నారు. శారీరక వ్యాయామం చేస్తున్నారా..? ధ్యానం, యోగా తదితర విషయాలను నమోదు చేయనున్నారు.

సత్ఫలితాల దిశగా..

వైద్యశాఖ చేపట్టనున్న సర్వే ఆధారంగా దీర్ఘకాలిక వ్యాధులు, సాధారణ లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేక సదుపాయాలు కల్పించనున్నారు. జిల్లాలో 26 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మరో నాలుగు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 9 బస్తీ దవాఖానాలు, 161 పల్లె దవాఖానాలు, 82 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీఎస్ (పల్లె, బస్తీ దవాఖానాల వైద్యులు) సూపర్‌వైజర్లు గ్రామాల్లో తిరిగి నేటి నుంచి మార్చి 30 వరకు సర్వే నిర్వహించనున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రాల్లో ఎన్సీడీ క్లినిక్‌లలో రోగులకు విస్తృతంగా పరీక్షలు నిర్వహిస్తున్నా. ఈ ప్రత్యేక కార్యక్రమంలో మరిన్ని వివరాలను సేకరించనున్నారు. వైద్య సిబ్బందికి (మిగతా 6వ పేజీలో)


నర్సరీని పరిశీలిస్తున్న అటవీశాఖ డిప్యూటీ కన్సర్వేటర్ దామోదరరెడ్డి

ఊట్లపల్లిలో మెగా ప్లాంటేషన్
» 50 ఎకరాలలో 300 రకాల వృక్షజాతుల పెంపకం
» గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్ ద్వారా నిర్వహణ 6
» దేశంలోనే మొట్టమొదటి ప్లాంటేషన్ : డీసీఎఫ్ దామోదర్‌రెడ్డి

శివరాత్రి పర్వానికి ముమ్మర ఏర్పాట్లు

- ఆలయాల వద్ద చలువ పందిళ్లు, క్యూలైన్లు...
- చర్యలు తీసుకుంటున్న ఈవోలు, భక్త బృందాలు

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న శివరాత్రి పండుగ సందర్భంగా ఆయా ఆలయాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు ఆలయాల కార్యనిర్వాహణ అధికారులు, ఆలయ భక్త బృందాలు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. చలువ పందిళ్లు,క్యూలైన్లు, స్నాన ఘట్టాలు, మంచి నీరు, తదితర ఏర్పాట్లను చేస్తున్నారు.

జిల్లాలోని తీర్థాల సంగమేశ్వరస్వామి ఆలయం, కూసుమంచి రామలింగేశ్వరస్వామి ఆలయం, స్నానాల లక్ష్మీపురం శ్రీచంద్రశేఖరస్వామి ఆలయం, మధిర మృంత్యుంజయ స్వామి ఆలయం, రామలింగేశ్వరస్వామి ఆలయం, ఖమ్మం నగరంలో బ్రాహ్మణబజార్ శివాలయం, గుంటుమల్లేశ్వరస్వామి ఆలయం, వైకొండాయిగూడెం శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, ఇండస్ట్రీయల్ ఏరియాలో శ్రీవిశాలక్షి సమేత శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంతోపాటు పలు శివాలయాల్లో ఏర్పాట్లను పూర్తి చేయనున్నారు. నగరంలోని గుంటుమల్లేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి 27వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వాహణ అధికారి రామకోటేశ్వరరావు తెలిపారు. అలాగే ఇండస్ట్రీయల్ ఏరియాలోని శ్రీవిశాలక్షీ సమేత శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో 26న మహా రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు, రాత్రి 7 గంటలకు స్వామి వారి కల్యాణం, పల్లకీసేవ, నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి తెలిపింది, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు నాగండ్ల కోటేశ్వరరావు తెలిపారు.


గుంటుమల్లేశ్వరస్వామి ఆలయం



బంజారాలతో సరదాగా..

భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ బుధవారం బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని ఇల్లెందు క్రాస్‌రోడ్‌లో ఈ వేడుకలు కనుల పండువగా జరిగాయి. కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు ప్రారంభించగా, కలెక్టర్ మమేకమై బంజారాలతో కలిసి స్టెప్పులేసి అలరించారు.

-ఆంధ్రజ్యోతి, లక్ష్మీదేవిపల్లి

సేవాలాల్ ఆశయాలతో
బంజారాలు ముందుకు సాగాలి...

- సేవాలాల్ స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు ...
- ఎమ్మెల్యేలు కూనంనేని, రాందాస్ నాయక్, కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సేవాలాల్ ఆశయ సాధనకోసం బంజారాలంతా సమష్టి కృషిచేయాలని కొత్తగూడెం, వైరా ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, రాందాస్ నాయక్, కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సేవాలాల్ స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.బుధవారం లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని ఇల్లెందు క్రాస్‌రోడ్ వద్ద గల హరిత కన్వెన్షన్‌లో శ్రీసంతులాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యేలు, కలెక్టర్ వేర్వేరుగా పాల్గొని భోగ్‌బండారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంజారాలను అక్షరాస్యులుగా ఎదిగేందుకు సంత్‌సేవాలాల్ పునాదులు వేశారని, ఆయన చేసిన కృషి ఫలితంగానే అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తున్నారని తెలిపారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్‌స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించే విధంగా ప్రభుత్వం జయంతి వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం బంజారాల వేషధారణలో కలెక్టర్ నృత్యాలు వేసి అందరిని అరించారు.కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, తహసీల్దార్లు పుల్లయ్య, ప్రసాద్, కృష్ణ, వివేక్, ఎంపీడీవోలు విజయభాస్కర్‌రెడ్డి, భారతి, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాష, కాంగ్రెస్ నాయకులు నాగసీతారాములు, బంజారాల పూజారి బానోతు నాగేశ్వరరావు, టీటీఎఫ్ రాష్ట్రనాయకులు రాములు నాయక్, బంజారనాయకులు రమేష్ రాథోడ్, భూక్య శ్రీనివాస్, శివ నాయక్, బాలాజీ, మోహన్ పాల్గొన్నారు.

కాలక్షేపానికే బడికి వస్తున్నారా..

- ఐటీడీఏ పీవో రాహుల్
- పిల్లలు తమ పేర్లు కూడా రాయలేని పరిస్థితి ఏమిటి
- కొడిసలగూడెం గిరిజన పాఠశాల ఆకస్మిక తనిఖీ
- ఇద్దరు ఉపాధ్యాయులపై చర్యలకు ఆదేశాలు


విద్యార్థులతో మాట్లాడుతున్న రాహుల్

దమ్మపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యను బలోపేతం చేయటానికి ఎన్ని సంస్కరణలు చేపట్టినా.. ఉపాధ్యాయులు సరైన బాధ్యత తీసుకోవటంలేదని, కనీసం చిన్నారులు తమ పేర్లు కూడా రాసుకోలేని పరిస్థితి ఉందని, కాలయాపనకే బడికి వస్తున్నారా అంటూ ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని కొడిసెలగూడెం గిరిజన ప్రాథమిక పాఠశాలను ఐటీడీఏ పీవో రాహుల్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పిల్లలతో అక్షరమాల, అధికారులు, ఇతరుల పేర్లను బోర్డుపై రాయించారు. పిల్లలు చదవటం, రాయటంలో వెనుకబడి ఉన్నారని గ్రహించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు ఏమి బోధిస్తున్నారు అంటూ ప్రశ్నించారు. కనీసం చదవటం, రాయటం కూడా రాకపోతే ఎందుకు అంటూ అసంతృప్తి వ్యక్తం చేసి ఇద్దరు ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏటీడీవో చంద్రమోహన్‌కు సూచించారు. సంబంధిత ఎస్‌ఆర్‌పీల పర్యవేక్షణ కూడా సక్రమంగా ఉండాలని సూచించారు. ఐటీడీఏ ద్వారా పంపిణీ చేసిన ఉద్దీపకం వర్క్‌బుక్స్ నిర్వహణ సరిగా చేయించకపోవటం వల్లే పిల్లలు చదవలేక, రాయలేకపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజు, ఏటీడీఏ చంద్ర మోహన్, ఇతర అధికారులు ఉన్నారు.

గరిమెళ్లపాడు నర్సరీ అభివృద్ధికి సహకరించండి : ఐటీడీఏ పీవో

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని గరిమెళ్లపాడు ఉద్యానవనాన్ని ఆంధ్రాలోని


పంటలను పరిశీలిస్తున్న పీవో రాహుల్

కడియంలోని నర్సరీల మాదిరిగా తయారుచేయటానికి వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు కార్యాచరణ రూపొందించి సహకరించాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలను బుధవారం పీవో సందర్శించారు. కళాశాలలో సాగు చేస్తున్న వివిధ రకాల పంటలను పరిశీలించారు. నూతన వంగడాలను పరిశీలించి శాస్త్రవేత్తల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాలలో శాస్త్రవేత్తలతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. గరిమెళ్లపాడులో 72 ఎకరాల్లో ఉద్యా నవనం నడుస్తోందని, నర్సరీ ద్వారా తెలంగాణలో ఎవరు ఎటువంటి మొక్కలు అడిగినా ఇక్కడ లభించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఐటీడీఏ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ నర్సరీని అందంగా తయారుచేసేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి కడియం నర్సరీని తలదన్నేలా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ హేమంత్‌కుమార్, యూనివర్సిటీ డీన్ అఫైర్స్ వేణుగోపాల్‌రెడ్డి, ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

పాడిచేటి జగన్నాథాచార్యులుకి
పలువురి నివాళి



భద్రాచలం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న ఖమ్మంలో మృతి చెందిన భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం విశ్రాంత ప్రధాన అర్చకుడు పొడిచేటి జగన్నాథాచార్యులు(71)కు దేవస్థానం వైదిక, పరిపాలన సిబ్బంది బుధవారం నివాళి అర్పించారు. నాలుగున్నర దశాబ్దాలపాటు రామయ్య సేవలో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించిన జగన్నాధాచార్యులు.. 1974లో దేవస్థానం అర్చకుడిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ముఖ్య అర్చకుడిగా, ఉప ప్రధాన అర్చకుడిగా బాధ్యతలు నిర్వహించారు. 2009లో దేవస్థానం ప్రధాన అర్చకుడిగా బాధ్యతలు చేపట్టి 2018 డిసెంబరు 31న ఉద్యోగ విరమణ చేశారు. 45 శ్రీరామనవములు, 44 వైకుంఠ ఏకాదశిల్లో ఆయన పాల్గొన్నారు.

తెలంగాణ యూత్ అథ్లెటిక్స్‌లో
భద్రాద్రికి 12 పతకాలు

చుంచుపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2025 పోటీలో భద్రాద్రి జిల్లాను 12 పతకాలు వరించాయి. హైదారాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ స్టేడియంలో ఇటీవల ముగిసిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన 30మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన 12 మంది క్రీడాకారులు పతకాలు సాధించారు. వీరికి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ యుగేందర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కె.మహిధర్ బుధవారం శుభాకాంక్షలు తెలియజేశారు.

కల్లూరు ఆస్పత్రి తనిఖీ

- పాల్గొన్న వైద్య ఆరోగ్య శాఖ, టాస్క్‌ఫోర్స్ బృందం

కల్లూరు, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని ప్రాథమిక ఆరోగ్య, సామాజిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్, టాస్క్‌ఫోర్స్ టీం లీడర్స్ డాక్టర్స్ శశిశ్రీ, ఎం.విజయకుమార్, డీపీవో దుర్గ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలు, ప్రసవాలు, ల్యాబ్, ఫార్మసీ వాక్సిన్ నిల్వలు పరిశీలించారు. ఆస్పత్రుల నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారామ్, ఫార్మాసిస్ట్ మోహన్, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రమేష్, సీహెచ్‌సీ వైద్యాధికారి నవ్యకాంత్ వైద్యులు మౌనిక శృతి పాల్గొన్నారు.

గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తాం

- కిష్టారం నిరవధిక దీక్షకు బీజేపీ మద్దతు

సత్తుపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కారణంగా అనారోగ్యం పాలవుతున్న కిష్టారం గ్రామస్థులను ఆదుకోకపోతే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తామని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. న్యాయమైన కోర్కెల సాధన కోసం 11రోజులుగా కిష్టారంలో అంబేద్కర్ నగర్, బీసీ కాలనీ వాసులు చేపట్టిన నిరవధిక దీక్షలకు బీజేపీ మద్దతు తెలిపింది. పునరావాసం కల్పించాలని, లేకుంటే సీహెచ్‌పీని గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయాలని సింగరేణి సంస్థను డిమాండ్ చేశారు. ఈ గ్రామం ఇలా అయ్యేందుకు మీ గ్రామపెద్దలు, నాయకులు, మంత్రులు అందరూ కారణమని, పార్టీలు మారాయే కానీ ఇప్పుడు వాళ్లే ఉన్నారని, ఎక్కడో నిర్మించాల్సిన సీహెచ్‌పీని ఇక్కడ పెట్టేందుకు లంచాలు, కమీషన్లు తీసుకున్న వారే కారణమన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రులను మూడుసార్లు సింగరేణి ప్రభావిత ప్రాంతాలకు తీసుకొచ్చామని, కేంద్ర ప్రభుత్వానికి 49శాతం వాటా సింగరేణిలో ఉందన్నారు. మాకు వ్యక్తులు, పదవులు ముఖ్యం కాదని, దేశం, ప్రజలే ముఖ్యమని, వారి ప్రాణాలు పోతుంటే ప్రధాని మోదీ చూస్తూ ఊరుకోరన్నారు. ఓసీలను నిర్మించేటప్పుడు ఇచ్చిన వాగ్దానాలను అప్పటి నాయకులతో పాటు అధికారులు మరిచారని, దీంతో గ్రామంలో ప్రజలు విలువైన భూములు పోగొట్టుకోవడంతో పాటు ఆర్థికంగా చితికిపోయారన్నారు. సీహెచ్‌పీ కారణంగా అనారోగ్యం పాలవుతున్నా కిష్టారం బాధితులకు మంచి జరగాలని కోరుతూ పార్టీ తరఫున కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం కిష్టారం బాధితుల సమస్యను బీజేపీ జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే సింగరేణి సీఎండీ బలరాంతో మాట్లాడి పరిష్కరించాలని కోరినట్లు నంబూరి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవీ.రమేష్, నాయకులు భాస్కర్రి వీరంరాజు, సుదర్శన్‌మిశ్రా, మట్టా ప్రసాద్, పాలకొల్లు శ్రీనివాస్, విజయ్, వసంతరావు, రహ్మతుల్లా, శేషగిరి, శివ తదితరులు పాల్గొన్నారు.




చర్ల మండలంలోని ఇసుక ర్యాంపులను పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి : ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం/లక్ష్మీదేవిపల్లి/భద్రాచలం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు అధికారులందరు సమర్థవంతంగా పనిచేయాలని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చేపడుతున్న చర్యల్లో భాగంగా ఎస్పీ భద్రాచలం, పాల్వంచలోని నాగారం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చర్ల మండలంలోని మొగళ్లపల్లి, వీరపురం, చింతకుంట ఇసుక ర్యాంపును సందర్శించారు. అక్కడ వీధుల్లో ఉన్న అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే విధంగా అక్రమ ఇసుకను తరలిస్తే అట్టి వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం ప్రభుత్వ అనుమతులతో నడుస్తున్న ర్యాంపుల నుంచి ఇసుక తరలించే విధానాన్ని పరిశీలించారు.

ఆరోగ్యమస్తు...

(5వ పేజీ తరువాయి)
ఇచ్చిన ట్యాబ్‌లలో సమగ్ర వివరాలను పొందుపరచనున్నారు. ఒక్క క్లిక్‌తో ఆరోగ్య వివరాలను తెలుసుకునే అవకాశం ఉంది. ఆకస్మాత్తుగా ఏదేని రోగంతో బాధపడుతూ మెరుగైన వైద్య సేవల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఈ సర్వేకి సంబంధించి హెల్త్ ప్రొఫైల్ గుర్తింపు సంఖ్య ఆధారంగా తదుపరి చర్యలు చేపడతారని అధికారులు వెల్లడించారు. ప్రతీ ఇంటికి సంబంధించిన ఆరోగ్య సమాచారం

వైద్యశాఖ వద్ద నమోదు చేసుకుంటే భవిష్యత్తులో వచ్చే రోగాలపై ముందుగానే అంచనా వేసే అవకాశాలు ఉన్నాయని నిపుణులు సూచిస్తున్నారు. భవిష్యత్తులో ఎవరికి ఏ సమస్య వచ్చినా వెంటనే తెలుసుకునేలా వెసులుబాటు ఉంటుందని ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి రామారావు వెల్లడించారు.

జిల్లాలో వివరాలు

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు :	26
పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు :	4
సామాజిక ఆరోగ్యకేంద్రాలు	7
పల్లెదవాఖానాలు :	161
బస్తీదవాఖానాలు :	9
ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు :	82

జిల్లాలో ఎన్సీడీ వ్యాధులు ఇలా

30ఏళ్లకు పైబడిన వారు :	7,36,933
గతంలో నిర్వహించిన పరీక్షలు :	4,91,789
షుగర్ బాధితులు	73,277
బీపీ రోగులు :	52,677

ఘనంగా శివాజీ మహరాజ్ జయంతి

● నగరంలో ఘనంగా శోభాయాత్ర

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి హిందూ వాహిని ఆధ్వర్యంలో శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి శోభాయాత్ర నిర్వహించారు. ఖమ్మం నగరంలోని పెవీలియన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభలో హిందూవాహిని రాష్ట్ర నాయకులు సదా వెంకట్, బేటీ బచావో నాయకులు శ్రీను, వేణుగోపాల్, కిశోర్‌బాబు, హిందూవాహిని జిల్లా అధ్యక్షుడు బోయిన సందీప్ మాట్లాడారు. శివాజీ సైన్యం ఎంతో బలంగా ఉండేదని కేవలం ఒక రాజ్యంతో ప్రారంభమైన శివాజీ 300 రాజ్యాలను సాధించి దేశంలోనే అత్యంతపెద్ద రాజుగా ఎదిగారన్నారు. శివాజీ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోని హిందూ సామ్రాజ్య స్థాపనలో ముందుండాలన్నారు. హిందూ మతాన్ని కాపాడిన ఘనత ఒక్క శివాజి మహారాజుకే దక్కుతుందన్నారు. అందుకే ఆయన జన్మదినాన్ని దేశ వ్యాప్తంగా వేడుకలా జరుపుకుంటారన్నారు. అనంతరం ఆర్ఎస్ఎస్, బీజేపీ, హిందూ సంఘాల ఆధ్వర్యంలో శోభయాత్ర నిర్వహించారు. సుమారు రెండు వేల మంది యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పెవీలియన్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన శోభయాత్ర వైరా రోడ్డు మీదుగా జమ్మిబండ వద్ద వరకు నిర్వహించారు. శివాజి విగ్రహంతో ప్రత్యేక పల్లకిలో నగరంలో బారీ ర్యాలీతో శోభయాత్ర నిర్వహించారు. యువత ద్విచక్ర వాహనాలతో శివాజి మహారాజ్‌కు జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. డప్పు వాయిద్యాలు, కోలాటాల నడుమ శోభయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హిందూవాహిని జిల్లా అధ్యక్షుడు బోయిన సందీప్, అల్లిక అంజయ్య తదితరులు పాల్గొన్నారు. గాంధీచౌక్‌లో వీర్ మరాఠా గోల్డ్ అండ్ సిల్వర్ రిఫైనరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజి మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీర్ మరాఠా గోల్డ్ అండ్ సిల్వర్ రిఫైనరీ అసోషియేషన్ అధ్యక్షుడు కె రాందాస్, కార్యదర్శి శివాజి, సభ్యులు పాల్గొన్నారు.

నా చావుకు కారణం ఆ ఇద్దరే..

(5వపేజీ తరువాయి)
కలహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సదరు యువతి.. భర్త, అత్త, మరిదిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, గతేడాది డిసెంబరు 26న కొత్తగూడెం రామవరంలో కేసు నమోదైంది.

కాగా, వివాదాన్ని పరిష్కరిస్తానని యువతికి అన్న వరస అయ్యే పల్లపు సంపత్ మధ్యవర్తిగా వ్యవహరించాడు. గొడవను తీర్చాల్సిన సంపత్.. తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని బాధితుడు సెల్ఫీ వీడియోలో ఆరోపించాడు. ఈ విషయమై ఇద్దరికీ దేహశుద్ధి చేసినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదని పేర్కొన్నాడు. ఇంత జరుగుతున్నా పోలీసు స్టేషన్‌లో తన ఫిర్యాదు తీసుకోలేదని, కానీ తనపై తన కుటుంబ సభ్యులపై మాత్రం కేసు నమోదు చేశారని ఆరోపించాడు. తన భార్య, పల్లపు సంపత్‌ల వల్లే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని తెలిపాడు. కాగా, సెల్ఫీ వీడియో రికార్డు అనంతరం బాధితుడు మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగాడు. అతడిని గమనించిన స్థానికులు వెంటనే 108 ద్వారా మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఊట్లపల్లిలో మెగా ప్లాంటేషన్

- 50 ఎకరాలలో 300 రకాల వృక్షజాతుల పెంపకం
- అటవీశాఖ డిప్యూటీ కన్జర్వేటర్ కె.దామోదర్ రెడ్డి

అశ్వారావుపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి సమీపంలో 50 ఎకరాల్లో గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్ (జీసీపీ పథకం) ద్వారా 50 ఎకరాల్లో వివిధ రకాలైన వృక్షజాతులతో ప్లాంటేషన్‌ను ఏర్పాటు చేసినట్టు అటవీశాఖ డిప్యూటీ కన్జర్వేటర్ కె.దామోదరరెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టు దేశంలోనే మొట్టమొదటి సారిగా ఊట్లపల్లిలో చేపట్టినట్టు తెలిపారు. ఈ ప్లాంటేషన్‌లో 300 రకాలకుపైగా వృక్షజాతులను వేసినట్టు తెలిపారు. బుధవారం అశ్వారావుపేటలో పలు నర్సరీలను ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన అశ్వారావుపేట రేంజ్ అధికారి మురళి, సెక్షన్ అధికారి కృష్ణమూర్తితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2025-26 సంవత్సరంలో కూడా ఈ ప్రోగ్రామ్ ద్వారా అశ్వారావుపేట మండలంలో 25 ఎకరాలు, దమ్మపేట మండలంలో 50ఎకరాలలో ప్లాంటేషన్‌ను కేంద్ర ప్రభుత్వ సహకారంతో వేస్తున్నట్టు వివరించారు. పాల్వంచ డివిజన్ పరిధిలో అర్హులుకాని వారి నుంచి పోడు భూములు, ఆక్రమణలో ఉన్న వాటిని 500 ఎకరాలను అటవీశాఖ వెనకకు తీసుకున్నట్టు తెలిపారు. ఇటువంటి భూముల్లో కాంపా పథకం ద్వారా ప్లాంటేషన్‌లను అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు.

ఇప్పటికే 60 ఎకరాలలో ప్లాంటేషన్ అభివృద్ధికి అనుమతులు లభించాయని, మిగతా వాటిలో ప్లాంటేషన్ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపామన్నారు. అటవీశాఖ పరిధిలోని భూముల నుంచి ఇసుక, మట్టి అక్రమ రవాణాలపై ఉక్కుపాదం మోపుతున్నామని, గతేడాది వీటిని అరికట్టేందుకు రూ.35లక్షల మేర జరిమానాలుగా వసూలు అయినట్టు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటికే రూ.30 లక్షలు జరిమానాల ద్వారా వచ్చినట్టు తెలిపారు.

పాల్వంచ డివిజనల్‌లో లక్ష వెదురు మొక్కలు పెంచుతున్నామని, జిల్లా వ్యాప్తంగా 6 లక్షలు పెంచుతున్నట్టు తెలిపారు. శ్రీగంధం 50వేలు, టేకు లక్ష, వివిధ రకాల మొక్కలు 3.15లక్షల మొక్కలను పెంచుతున్నట్టు తెలిపారు. అలానే అశ్వారావుపేట రింగ్‌రోడ్డు సెంటర్‌లో అటవీ చెక్ పోస్టు రోడ్డు విస్తరణలో తొలగించడం జరిగిందని, దాని వెనుకనున్న గార్డు క్వార్టర్ శిథిలమైందన్నారు. ఇక్కడ అటవీశాఖకు 11 కుంటల భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉందని, వాటిని కొందరు ఆక్రమించడం జరిగిందని, న్యాయపరంగా వాటిని స్వాధీనం చేసుకొని చెక్‌పోస్టు, క్వార్టర్ నిర్మిస్తామని తెలిపారు.

కాగితం కర్రకు కష్టకాలం

(5వ పేజీ తరువాయి)
తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం రూ.8వేల నుంచి రూ.8,500ధర చెల్లిస్తున్నారు. ఫలితంగా రైతుకు కలప నరికించినందుకు, తొక్క తీసినందుకు, రవాణా ఖర్చులు పోను రూ.6నుంచి రూ.7వేల వరకు వచ్చే పరిస్థితి నెలకొంది.

సంక్రాంతి తరువాత ఒక్కసారిగా కలప ధర తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ఖమ్మం కలెక్టర్‌ను కలిసి రైతు సంఘాలు జామాయిల్, సుబాబుల్ ధర తగ్గకుండా చర్యలు తీసుకోవాలని, పేపర్‌మిల్లు యాజమాన్యాలతో మాట్లాడి తమకు న్యాయం చేయాలని కోరాయి. లేనిపక్షంలో దశలవారీగా పోరాటాలు సాగిస్తామని, టన్నుకు రూ.10వేల ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గిట్టుబాటు ధర ఇస్తే చాలు..
కర్నాటి రాజేంద్ర ప్రసాద్, కొక్కిరేణి



నేను గత 15 ఏళ్లుగా సుబాబుల్ సాగుచేస్తున్నా.. డిసెంబరు వరకు ధర లాభసాటిగానే ఉంది. టన్నుకు రూ.9వేల వరకు చెప్పారు. ఇప్పుడు రూ.7,200 అని చెబుతున్నారు. కేవలం నెలరోజుల్లోనే రూ.1,500నుంచి రూ.2వేలు రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. రైతులకు గిట్టుబాటు ధర ఇస్తే ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వాల్సిన అవసరమే లేదు. టన్ను కలప ధర రూ.10వేలు ఇస్తే రైతుకు మేలు జరుగుతుంది. జామాయిల్, సుబాబుల్ రైతులకు న్యాయం చేయకపోతే ఉద్యమిస్తాం.

రేపు హమాలీ సంఘం రాష్ట్ర మహాసభ

పెనుబల్లి/ కొణిజర్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో శుక్రవారం నిర్వహించే హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాలుగో మహాసభను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కె.పుల్లయ్య, లాల్‌మియా కోరారు. పెనుబల్లి మండలంలోని లంకాసాగర్ క్రాస్‌రోడ్డులో రైస్‌మిల్లుల వద్ద, కొణిజర్ల మండలంలోని ఎల్లన్ననగర్ గ్రామంలో మహాసభ వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.

ఎండల వేళ జాగ్రత్త.. జాగ్రత్త...

(5వ పేజీ తరువాయి)
ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. బస్‌స్టాప్, రైల్వేస్టేషన్ వద్ద చల్లని తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని, పంచాయతీ కార్యదర్శులు, వార్డ్ అధికారుల వద్ద కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాలన్నారు.

జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. వడదెబ్బ తగిలిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందించాలని సమీప ఆస్పత్రికి ఎలా తరలించాలి అనేదానిపై ప్రణాళిక తయారు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో డీసీపీ నరేష్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కళావతిబాయి, డీసీహెచ్ఎస్ రాజశేఖర్, ఆర్డీవోలు నరసింహారావు, ఎల్.రాజేందర్, డీపీవో ఆశాలత, జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, అడిషనల్ డీఆర్డీవో. నూరుద్దీన్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.వెంకట నారాయణ, విద్యాశాఖ సీఎంవో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రానిది ప్రజావ్యతిరేక బడ్జెట్

- ప్రైవేటీకరణకు స్వస్తి చెప్పాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజావ్యతిరేకంగా ఉందని, ఈ బడ్జెట్‌పై కేంద్రం పునరాలోచించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలో కేంద్ర బడ్జెట్‌పై నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ సంపన్న వర్గాలకు మేలు చేసేదిగా ఉందన్నారు. పాలకులు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తే ఊరుకోబోమన్నారు. ప్రజల పక్షాన వామపక్షాలు సూచించిన ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను ఆమోదించి బడ్జెట్ ప్రవేశపెట్టాలని, కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు రాయితీలు కల్పిస్తూ పేదలపై పన్నులభారం మోపుతున్నారని విమర్శించారు. కేంద్రానికి వస్తున్న ఆదాయంలో 97శాతం పేదల కష్టార్జితమేనని, సంపన్నులు చెల్లించేది 3శాతమేనని దుయ్యబట్టారు.

దేశంలో ఉన్న 200మంది శత కోటీశ్వరులపై 4శాతం సంపాదన పన్ను విధించాలని, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు హామీ ఇవ్వాలని, బీమా రంగంలో ఎఫ్‌డీఐని పూర్తిగా విరమించుకోవాలని, ప్రైవేటీకరణకు స్వస్తి చెప్పాలని వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. తొలుత బడ్జెట్‌ను నిరసిస్తూ సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ పార్టీల కార్యాలయాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.

కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వరరావు, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గౌని నాగేశ్వరరావు, న్యూడెమోక్రసీ (చంద్రన్న వర్గం) జిల్లా నాయకులు కందగట్ల సురేందర్, ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు సతీష్, వామపక్ష పార్టీల నాయకులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, రత్న కుమారి, ఫహీం, బాలరాజు, బ్రహ్మచారి, శ్రీనివాస్, రమేష్, అభిమన్యు, నాగకృష్ణ, లక్ష్మి, సీతరామయ్య, ఉమ, అలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ అందించాలి

టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాటిల్

కొత్తగూడెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ అంతరాయం లేకుండా విద్యుత్ నిరంతరం సరఫరా అయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్ అన్నారు. బుధవారం జిల్లాలోని విద్యుత్, తాగునీరు, సాగునీరు, రేషన్ కార్డు దరఖాస్తుల పరిశీలన, రైతు భరోసాల నమోదు ప్రక్రియలపై అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, సంబంధిత జిల్లా అధికారులు, మండల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల గృహ, వాణిజ్య అవసరాల కు అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. రైతు భరోసా దరఖాస్తులు ఆన్‌లైన్ ప్రక్రియలో భాగంగా పార్షియల్ సబ్‌డివిజన్ మార్కింగ్ ఆప్షన్లు అందుబాటులోకి వచ్చినందున తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులు తమ పరిధిలోని వ్యవసాయానికి యోగ్యం కాని భూముల మార్కింగ్ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తిచేయాలన్నారు. జిల్లాలో యూరియా ఎంత అందుబాటులో ఉంది.. ఎంత అవసరం పడుతుందో నివేదికలు సమర్పించాలని, రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

'రైతు భరోసా' తీరుపై డిప్యూటీ సీఎం భట్టి ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వైరా, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతున్న తీరుపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ నాయకులతో మాట్లాడి ఆరా తీశారు. 'రైతు భరోసా... ఇదేమి గోస?' అనే శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనాన్ని వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి భట్టి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన భట్టి విక్రమార్క 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆరా తీశారు. వాస్తవాలను కళ్లకు కట్టినట్లు కథనంలో రైతు భరోసా అమలవుతున్న తీరును వివరించారని భట్టికి నర్సిరెడ్డి తెలిపారు. ఉన్నత స్థాయిలో వెంటనే సమీక్ష సమావేశాన్ని నిర్వహించి రైతు భరోసాలో నెలకొన్న అయోమయం, గందరగోళానికి ముగింపు పలకాలని భట్టిని కోరగా చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. మూడెకరాల్లోపు భూములకు రైతు భరోసా సొమ్ము రైతుల ఖాతాల్లో జమచేశామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఎకరం లోపు రైతులకు కూడా రైతుభరోసా రాలేదని దాంతో రైతుల్లో అసంతృప్తి ఉందని భట్టికి వివరించారు. ఇదిలా ఉంటే 'ఆంధ్రజ్యోతి' కథనం వ్యవసాయశాఖ అధికారుల గ్రూపుల్లో కూడా హల్‌చల్ చేసింది. అన్ని స్థాయిల్లోని అధికారుల్లో ఇది చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వ హయాంలోని ఉన్నత అధికారులే నేడు కూడా వ్యవసాయశాఖలో కొనసాగుతున్నప్పటికీ గతంలో మాదిరిగానే పకడ్బందీగా రైతు భరోసా సొమ్మును ఎకరాల వారీగా రైతుల ఖాతాల్లో ఎందుకు జమ చేయించటం లేదనే విమర్శలను కూడా కాంగ్రెస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రస్తావిస్తున్నారు. గతంలో రైతుల నుంచి ఎలాంటి విమర్శలు లేకుండా రైతు భరోసా సొమ్ము అందజేసిన అధికారులు ఇప్పుడు తమ ప్రభుత్వాన్ని రైతుల్లో అబాసుపాలు చేసేందుకు ఏమైనా మతలబు చేస్తున్నారనే అనుమానాలను కాంగ్రెస్ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి.

నూతన ప్రాజెక్టుల ఏర్పాటే లక్ష్యం

ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు



రుద్రంపూర్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నూతన ప్రాజెక్టుల ఏర్పాటే లక్ష్యంగా పని చేస్తానని ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు తెలిపారు. నాణ్యతతో కూడిన బొగ్గు ఉత్పత్తే లక్ష్యంగా సింగరేణిలంతా శ్రమించాలని కోరారు. ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ బుధవారం సింగరేణి కార్యాలయంలో ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పారిశ్రామిక సంబంధాలను మెరుగు పరిచేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. కొత్తగూడెం ఏరియాలోని వికె-7 ఓపెన్‌కాస్ట్, ఇల్లెందు పరిధిలోని జేకే ఓపెన్ కాస్ట్, గోలేట్ ఓపెన్ కాస్ట్‌లకు త్వరలోనే అనుమతులు వచ్చే అవకాశం ఉందన్నారు.బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లును సింగరేణి ఉద్యోగులు, కార్మికులు కలిసి పూలమాలలతో సన్మానించారు. నూతనంగా బాధ్యతలను చేపట్టిన వెంకటేశ్వర్లును సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గుర్తింపు సంఘం నాయకులు సన్మానించారు. సింగరేణి అభివృద్ధికి, కొత్త బావులు తీసుకురావాలని ఆయన కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- వ్యవసాయ యూనివర్సిటీ బోధనా సిబ్బంది క్రీడలు ప్రారంభం



క్రీడాకారులతో కలెక్టర్ జితేష్ వి. పాటిల్

అశ్వారావుపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ యూనివర్సిటీ పరిధిలోని బోధన సిబ్బందికి నిర్వహిస్తున్న క్రీడాపోటీలలో సిబ్బంది విద్యార్థులకంటే ఎంతో ఉత్సాహంగా పాల్గొనటం హర్షణీయమని భద్రాద్రి కొత్తగూడెం జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో యూనివర్సిటీ స్థాయి బోధన సిబ్బందికి క్రీడా సాహితి సంస్కృతిక పోటీలను యూనివర్సిటీ డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ డా. సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, యూనివర్సిటీ అబ్జర్వర్ సురేష్, కళాశాల అసోసియేట్ డీన్ డా. జె హేమంత్‌కుమార్‌తో కలసి శాంతి పావురాలను ఎగురవేసి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ క్రీడా పోటీలు ఓ స్ఫూర్తిదాయకమైనదని, బోధన సిబ్బంది క్రీడలలో పాల్గొనటమే ఓ విజయమని, గెలుపోటములను క్రీడా స్ఫూర్తితో చూడాలన్నారు. ప్రస్తుత సమాజంలో వయసు పెరిగే కొద్ది కొన్ని ఇబ్బందులు వస్తున్నాయని, క్రీడలు, వ్యాయామంతో వాటిని అధిగమించి నిత్య ఆరోగ్యంతో ఉండొచ్చునన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుండి క్రీడాకారులు ఈ క్రీడలలో పాల్గొనటానికి రావడం సంతోషదాయమన్నారు. పోటీతత్వంలోనే మనలోని ప్రతిభ వెలుగు చూస్తుందని, ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకమైన సంస్కృతి, భావాలు ఉంటాయని, ఉద్యోగులు ఆయా ప్రాంతాలలో పనిచేయడం వల్ల అన్ని ప్రాంతాల పరిస్థితులపై అవగాహన కలిగి ఉంటారన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో సాగు అవుతున్న మునగతోటను పరిశీలించారు. సాగులో తీసుకుంటున్న జాగ్రత్తలను శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఆదాయంను అందించే మునగ సాగుపై రైతుల్లో అవగాహన కల్పించాలని కోరారు. శాస్త్రవేత్తలు రైతులతో మమేకమై వ్యవసాభివృద్ధికి సహకరించాలని కోరారు. వ్యవసాయం, ఉద్యాన పంటలకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలను రైతులవద్దకు చేరేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, యూనివర్సిటీ పరిధిలోని నాలుగు జోన్ల పరిధిలోని వ్యవసాయ కళాశాల బోధన సిబ్బంది పాల్గొన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో ప్రసాదరావు తదితరులున్నారు.



మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

మిర్చి బోర్డు ఏర్పాటుకు మంత్రి తుమ్మల చొరవ చూపాలి

- తెలంగాణ రైతు సంఘం

ఏన్కూరు, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ చూపాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. ఏన్కూరు మిర్చి మార్కెట్‌ను బుధవారం తెలంగాణ రైతుసంఘం బృందం పరిశీలించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చి రైతులకు వైరస్ తెగుళ్ళు, నల్లి మూలంగా తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. ఎగుడు, దిగుడు పై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండ ల కార్యదర్శి దొంతిబోయిన నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూక్యా లక్ష్మా, నెల్లపట్ల వెంకటేశ్వరరావు, వెంకటేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం ఆపకపోతే ఆత్మహత్యే శరణ్యం

- పరిహారం లేకుండానే రోడ్డు నిర్మిస్తున్నారని ఆందోళన



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

ముదిగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా తమ భూమి నుంచి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని అది ఆపకపోతే తమకు ఆత్మహత్యే శరణ్యమని బాణాపురం గ్రామానికి చెందిన వీరబాబు, బాబూరావు అనే రైతులు బుధవారం తహసీల్దార్ సునీతా ఎల్జిబెత్‌కు ఫిర్యాదు చేశారు. కమలాపురం రెవెన్యూలో సాగులో ఉన్న భూమిలో తమ అనుమతి, పరిహారం చెల్లించకుండా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని పేర్కొన్నారు. తమకు ఎటువంటి సమాచారం లేకుండా భూమిలో ఎలా రోడ్డు వేస్తున్నారని పంచాయతీరాజ్ అధికారులను ప్రశ్నించినప్పటికీ వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సదరు కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా రోడ్డు తీసివేసి సాగుచేసుకోమని వ్యగ్యంగా మాట్లాడుతున్నారని వాపోయారు. రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటే తమ కుమారుడు ప్రభుత్వ ఉద్యోగి అని ఆ ఉద్యోగం నుంచి పీకేస్తామని బెదిరిస్తున్నారని తహసీల్దార్ ముందు బాబూరావు కన్నీళ్ల పర్యంతమయ్యాడు. తమ భూమి నుంచి రోడ్డు నిర్మాణం జరుగుతున్నందున ఆపనులను ఆపకపోతే తాము ఆత్మహత్య చేసుకొనేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు.

పేదల భూమిలో పెద్దల పాగా

- బినామీ పేర్లతో కొనుగోలు
- లక్షల్లో పలుకుతున్న ఎకరం ధర
- సర్వేనెం.53 లో ఖరీదైన 470 ఎకరాలతో ప్రభుత్వ భూమి

మధిరటౌన్, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు మధిర పట్టణానికి దూరంగా ఉన్న సర్వేనెం. 53 లోని ప్రభుత్వ భూమికి ప్రస్తుతం డిమాండ్ పెరిగింది. పట్టణం విస్తరించడంతో అక్కడ ఉన్న 470 ఎకరాల భూమి ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో ఆ భూములపై పెద్దల కన్ను పడింది. తక్కువ ధరకు కొనుగోలు చేసి కొందరు ఈ భూముల్లో బినామీలైన ఎస్సీ, ఎస్టీల పేర్ల తో స్వాధీనంలో ఉంచుకున్నారు. మరి కొందరు వారే సేద్యం చేసుకుంటున్నారు. వీరిలో రాజకీయ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగుల కుటంబీకులు, స్థిరాస్థి వ్యాపారులు ఉన్నారు. ఒకరియల్టర్ ఏకంగా ఈ భూమిలో ఓఖారీ ఫంక్షన్‌హాల్ హాల్ నిర్మించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

భట్టిని కలిసిన పట్టాదారులు...

ఈ ప్రభుత్వ భూమికి ఆనుకొని ఉన్న ప్రైవేటు భూమి విలువ ఎకరం రూ. 40 లక్షల నుంచి రూ. పది కోట్ల వరకు పలుకుతోంది. దీంతో గతంలో పట్టాలు పొంది భూమి హద్దులు తెలియని వారు, ఆక్రమించుకున్న మరికొందరు ఎలాగైనా పట్టాలు పొందే ప్రయత్నం చేస్తున్నారు. పట్టాలు ఉన్న వారు ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి తమకు పాతికేళ్ల క్రితమే ప్రభుత్వం పట్టాలు ఇచ్చి భూమిని చూపలేదని వినతిపత్రం ఇచ్చారు. దీంతో ఆయన సర్వే చేయాలని అధికారులను ఆదేశించారు. పెద్ద బీడుగా పిలిచే సర్వే నెం.53లో వైరా మధిర ప్రధాన రహదారికి ఆనుకుని మధిర చెరువు వరకు ప్రభుత్వభూమి ఉంది. ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల, నాల్గవ తరగతి ఉద్యోగులకు ఇళ్ల స్థలాలతో పాటు పేదల కోసం ముస్లిం, రామనాథం కాలనీలు ఏర్పాటు చేశారు. 2000,2007లో ప్రభుత్వం పేద ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అర ఎకరం నుంచి ఎకరం వరకు సాగులో ఉన్న 186 మందికి అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చారు.

సర్వే పురోగతిలో ఉంది

రాంబాబు, తహసీల్దార్



ప్రభుత్వం 186 పేదలకు పట్టాలు ఇచ్చింది. పట్టాలు ఉన్న వారందరికి భూమిని చూపేందుకు సర్వే చేస్తున్నాం, మెట్ట ప్రాంతం సర్వే అయిపోయింది. కోతలు అయ్యాక సర్వే చేసి పట్టాలు ఇచ్చిన వారికి భూమిని చూపిస్తాం. అసైన్‌మెంట్ భూమిని ఇతరులు ఎవరు కొన్నా చెల్లదు.

భూమిని పేదలకు పంచాలి

శ్యామరావు, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు



ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి ఎకరం చొప్పున పట్టాలు ఇస్తే ఎస్సీ, ఎస్టీ ల్లోనే కొందరు నాలుగు నుంచి ఐదెకరాల వరకు ఆక్రమించారు. పట్టా ఉన్న కొందరికి భూమిని చూపలేదు. ఆక్రమణలో ఉన్న భూమికి విముక్తి కల్పించడం తో పాటు పేదలకు న్యాయం చేయాలి.

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

పాల్వంచ,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి):మద్యానికి బానిసై వ్యక్తి మృతిచెందిన సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేసారు. పట్టణ పరిధిలోని వెంగళరావుకాలనీకి చెందిన గుండ్లపల్లి వేణు(58) స్థానికంగా కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్యకాలంలో మద్యానికి బానిసాయ్యాడు.ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి అతిగా మద్యం సేవించాడు. అప్పటికీ సంతృప్తి చెందక అంబేద్కర్ సెంటర్లోని ఓ బార్‌లో మద్యం బాటిల్ కొనుగోలు చేసి బయటకు వస్తుండగా అకస్మాత్తుగా కిందపడి అపస్మారకస్థితిలోకి చేరుకున్నాడు. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి తల్లి రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్య కారణాలతో వ్యక్తి ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సత్తుపల్లి మండలం గంగారంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఎండీ. నజీరుద్దీన్ (45) కొంతకాలంగా కిడ్నీసంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. రెండునెలల క్రితం ఒకకిడ్నీని వైద్యులు తొలగించారు. ఇటీవల రెండో కిడ్నీకి సమస్య తలెత్తింది. ఈ క్రమంలో అనారోగ్య కారణాలతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య జీనత్ ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

చెల్లని చెక్కు కేసులో 3నెలల జైలు

ఖమ్మంలీగల్,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో ఖమ్మం నగరంలోని టీకే బజారు ప్రాంతానికి చెందిన నిందితుడైన బిజ్జాల భాస్కర్‌కు మూడు నెలలు జైలుశిక్ష విధించారు. ఫిర్యాదుకి 1లక్ష 20వేల నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప బుధవారం తీర్పుచెప్పారు. ఖమ్మం నగరంలోని టీకేబజారు ప్రాంతానికి చెందిన ఉల్లిశ్రీనివాసరావు అలియాస్ శ్రీను వద్ద నిందితుడు కుటుంబ అవసరాల నిమిత్తం 2015న 1లక్ష రూపాయలు అప్పుగా తీసుకొని అదేరోజు ప్రాంసరీనోటు వ్రాయించి ఇచ్చాడు. తరువాత ఫిర్యాది తనరుణం తిరిగి చెల్లించమని ఒత్తిడిచేయగా 2018లో 1లక్ష రూపాయలకు చెక్కు జారీ చేసినాడు. ఆ చెక్కును ఫిర్యాది బ్యాంకుఖాతాలో జమచేయగా నిందితుడి ఖాతాలో సరిపడా నగదు లేనందున చెక్కు నిరాదరణకు గురైంది. ఫిర్యాదు తన న్యాయవాది ఎస్.వెంకటేశ్వర్లు ద్వారా లీగల్ నోటీసు జారీ చేశారు. కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావటంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

పెదార్లగూడెంలో అగ్నిప్రమాదం

దుమ్ముగూడెం,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): పెదార్లగూడెంలో పాయం ముత్యాలక్క ఇల్లు బుధవారం కాలిబూడిదైంది. ఇంట్లోని రూ.2లక్షల నగదు, గృహోపకరణాలు కాలిబూడిదయ్యాయి. రూ.5లక్షల ఆస్తినష్టం జరిగినట్లు ఆర్‌ఐ నర్సింహారావు పంచనామా నివేదికలో పేర్కొన్నారు. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణమని తెలుస్తోంది. విజయవాడ పీవీ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు పీవీ కృష్ణారావు రూ.5వేలను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ అందజేశారు.

బంగారు చైన్‌ను వెతికిచ్చిన గజ ఈతగాళ్లు

భద్రాచలం,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి):భద్రాచలంలోని గోదావరిలో ఖమ్మానికి చెందిన భక్తులు సురేందర్ కుటుంబ సభ్యులు స్నానం చేస్తుండగా మెడలో ఉన్న రూ.1.20లక్షల విలువైన బంగారు చైను పడిపోయింది. సమీపంలోని గజఈతగాళ్లు కరక ప్రసాద్, అతని బృందం ఆ ప్రాంతంలో గాలించి బంగారు చైన్‌ను బాధితులకు అందజేశారు.



ప్రాణం తీసిన మనోవేదన

జడలచింతలో యువకుడి ఆత్మహత్య



అరవింద్ కుమార్(ఫైల్)

జూలూరుపాడు, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మానసిక వేదనతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జూలూరుపాడు మండలంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని జడలచింత గ్రామానికి చెందిన దబ్బా అరవింద్‌కుమార్(20) పాపకొల్లులోని ఓ ఆర్ఎంపీ వద్ద కంపౌండర్‌గా పని చేస్తున్నాడు. కొన్నిరోజులుగా సదరు యువకుడు ముభావంగా ఉంటూ తాను చచ్చిపోతానని పలుమార్లు తల్లిదండ్రుల వద్ద వాపోయాడు. ఏమైందని తల్లిదండ్రులు అడిగినప్పటికీ కుమారుడు విషయం చెప్పలేదు. భయం వద్దని, ధైర్యం చెప్పారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం యువకుడు ఇంట్లోనే పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. కుటుంబ సభ్యులు గమనించి వైద్య చికిత్సలను అందించేందుకు కొత్తగూడెంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీ.. వాకింగ్ చేస్తున్న వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): రహదారి వెంట వాకింగ్ చేస్తున్న ఓ వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొనటంతో మృతిచెందాడు. ఈ సంఘటన సత్తుపల్లి మండలంలో బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని కాకర్లపల్లికి చెందిన నాగళ్లరామకృష్ణ(39) మార్నింగ్ వాకింగ్‌కు వెళుతున్నాడు. కాకర్లపల్లి-తోగ్గూడెం మధ్యలోకి రాగానే రుద్రాక్షపల్లి నుంచి సత్తుపల్లి వెళుతున్న బుగ్గపాడుకు చెందిన వెంకటేశ్వర్లు ఆ వ్యక్తిని ఢీకొట్టాడు. తెల్లవారుజామున కనిపించకపోవడంతో ప్రమాదవశాత్తూ ఈ ఘటన జరగటంతో రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. వాహనంతో ఢీకొట్టిన వెంకటేశ్వరరావుకు సైతం గాయాలవ్వగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి



జూలూరుపాడు,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపకొల్లు గ్రామానికి చెందిన హమాలీ కార్మికుడు అప్పికట్ల బాలకృష్ణ(45) ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై బుధవారం జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాలకృష్ణ ఈనెల5న కొత్తకొత్తూరులో ఓరైతు పొలంలో మిర్చి బస్తాలు తొక్కుతుండగా తాడు తెగడంతో కింద పడ్డాడు. అతడికి గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్సలు అందిస్తున్నారు. చికిత్స పొందుతూ ఆయన బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి స్వాధీనం

మణుగూరు పరిధిలో 64 కేజీలు, భద్రాచలంలో17 కేజీలు, ఖమ్మం రైల్వేస్టేషన్‌లో 46కేజీలు..



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితుడిని చూపిస్తున్న ఖమ్మం జీఆర్పీ సీఐ అంజలి

మణుగూరు,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు అటవీ ప్రాంతం నుంచి బెంగళూరుకు కారులో అక్రమంగా తరలిస్తున్న 64కేజీల గంజాయిని బుధవారం మణుగూరు ఎక్సైజ్‌పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు మణుగూరు స్టేషన్‌టీమ్ పట్టణంలోని రథంగుట్ట అర్బన్ పార్కువద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా కారును తనిఖీ చేశారు.64 కేజీలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కేరళాకు చెందిన మహ్మద్ జమీర్‌ను అదుపులో తీసుకున్నారు.పట్టుబడ్డ గంజయి విలువ రూ.17.10 లక్షలు ఉంటుందని అసిస్టెంట్ సూపరింటెండెంట్ కరమ్‌చంద్ తెలిపారు.

17 కేజీల ఎండు గంజాయి..

భద్రాచలం: భద్రాచలంలోని ఎక్సైజు అధికారులు స్థానిక ఆర్టీవో చెక్‌పోస్టు వద్ద బుధవారం 17 కేజీల ఎండు గంజాయిని పట్టుకున్నారు. ఈ సంఘటనలో నలుగురు నిందితులను అరెస్టు చేయడంతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజు సీఐ రహీమున్నాసాబేగం, ఎస్సై అల్లూరి సీతారామరాజు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 46కేజీలు

ఖమ్మంక్రైం:నగరంలోని రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫారంపై ఓవ్యక్తి వద్ద నుంచి 46 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు జీఆర్పీ సీఐ ఎస్.అంజలి తెలిపారు. బుధవారం రెండోప్లాట్‌ఫారంపై తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్రలోని సేలు తాలూకా పర్బనీ జిల్లా కేతబ్‌మొహల్లాకు చెందిన షేక్ రహీముద్దీన్ అనుమానస్పదంగా కనిపించాడు. విచారణ జరపగా ఒడిస్సాలోని తక్కువ ధరకు గంజాయికొని ముంబయిలో ఎక్కువ ధరకు అమ్మేందుకు వెళుతున్నట్లు చెప్పాడు. కోణార్క్ రైలు వెళుతుండగా సరైన రైల్వే టికెట్ లేకపోవడంతో తనిఖీచేస్తున్న నేపథ్యంలో ఖమ్మంలో దిగినట్టు ఒప్పుకున్నాడు. 46కేజీల గంజాయి ఉన్న సూటుకేసును స్వాధీనం చేసుకున్నామని,సుమారు దాని విలువరూ.11,58,000 ఉంటుందని చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు

- సీసీఎఫ్ భీమానాయక్



సిబ్బందితో మాట్లాడుతున్న సీసీఎఫ్ భీమానాయక్

అశ్వాపురం,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో ఉన్న ఫారెస్ట్ సిబ్బందిపై దాడులకు పాల్పడినా,ప్రోత్సహించినా సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని చీఫ్ కన్జర్వేటర్‌ఆఫ్ ఫారెస్ట్(సీసీఎఫ్) భీమానాయక్ హెచ్చరించారు. బుధవారం అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని మనుబోతులపాడు బీట్‌లో ఆయన పర్యటించారు. బీట్ పరిధిలో ఈఏడాది చేపట్టబోయే ప్లాంటేషన్ నిర్మాణాలు, పోడును అడ్డుకునేందుకు సిబ్బంది చర్యలను ఆయన పరిశీలించారు. అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. బీట్‌పరిధిలో సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్‌లోకూడా ఇదేవిధమైన చర్యలు చేపడితే పోడుకు అవకాశం ఉండదన్నారు. అనంతరం బీట్‌పరిధిలోని వేములూరులో సిబ్బంది క్వార్టర్స్ ను పరిశీలించి ఆవరణలో ప్లాంటేషన్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఎఫ్ఓ క్రిష్ణగౌడ్, మణుగూరు ఎఫ్‌డీవో మొహినుద్దీన్, మణుగూరు,అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ అధికారులు ఉపేందర్, రమేష్, మనుబోతులపాడు సెక్షన్ అధికారి నాగరాజు,సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మణుగూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామానుజవరం, చిన్నరావిగూడెం గ్రామాల్లో అక్రమంగా ఇసుక తోలకాలు జరిపే ట్రాక్టర్లను పోలీసులు బుధవారం సీజ్ చేశారు. కేసులు నమోదు చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను గోదావరి నుంచి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సతీష్ కుమార్ హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇంటి నమూనా.. కలల ప్రతిరూపంగా ఉండాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ఇంటి నిర్మాణ స్థల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారుల సొంతింటి కలకు ప్రతిరూపంగా ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణం ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని తరుణిహట్ ఆవరణలో ఇళ్ల నమునా స్థలాన్ని బుధవారం పరిశీలించారు. మండల ప్రజలు ఇక్కడకు వచ్చి ఇక్కడ నిర్మించిన ఇంటిని పరిశీలించి వారిస్థలాల్లో నిర్మించుకునేందుకు వీలుగా నమూనా ఇల్లు ఉండాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లపద్ధతి ప్రకారం నిర్మించేందుకు మేస్త్రీలకు శిక్షణను ఇస్తామన్నారు. ఇందిరమ్మ లబ్దిదారుల సహకారంతో మంచి ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, హౌజింగ్ ఇఇ శ్రీనివాస్‌రావు, పీఆర్ ఇఇ వెంకటరెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణకు చర్యలు

ఖమ్మంకలెక్టరేట్: పిల్లల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ చివరి త్రైమాసిక పని తీరుపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. మండల స్థాయిలో చైల్డ్ ప్రొటెక్షన్ సంబంధించి సమావేశాలు నిర్వహించాలన్నారు, దీనికి సంబంధించి తహసీల్దార్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలన్నారు. చిన్న పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, హై స్కూల్ పిల్లలకు సామాజిక మాధ్యమాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిచయం లేని వ్యక్తులతో మాట్లాడకుండా ఉండటం వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ సెంటర్, బస్ స్టాప్ వంటి ప్రభుత్వ భవనాలపై చైల్డ్ లైన్‌హెల్ప్ లైన్ నెంబర్ తెలిసేలా పేయింటింగ్స్ వేయించాలన్నారు.ఈ సమావేశంలో డీసీపీ నరేష్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కళావతి బాయి, డీఎస్‌సీడీవో. కస్తాల సత్యనారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ ఉప సంచాలకులు ఎన్. విజయలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్, ఆర్డీవోలు నరసింహారావు, ఎల్. రాజేందర్ పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	24
గుత్తి వంకాయ	36
బీరకాయ	58
పచ్చిమిర్చి	30
బెండకాయ	48
బెండకాయ	48
పొట్లకాయ	30
దోసకాయ	44-44
చిక్కుడు	38
నాటుచిక్కుడు	90
గోరుచిక్కుడు	54
క్యాబేజీ	20
దొండ	30-36
సొరకాయ	20
క్యారెట్	36
క్యాప్సికం	54
ఆలుగడ్డ	24
ఉల్లిగడ్డ	45-50
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	140
కొత్తిమీర కట్ట	10

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	తండేల్
శ్రీనివాస:	డాకూ మహరాజ్
సాయిరాం:	పట్టుదల
కేపీఎస్:	ఒక పథకం ప్రకారం
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణా

పని ఉంటేనే ప్రవేశం !

- ఇక కేఎంసీ కట్టుదిట్టం
- ఉద్యోగిని బెదిరించిన వారిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు
- ఉద్యోగులకు గుర్తింపుకార్డు, బయోమెట్రిక్ హాజరు
- లంచ్ కోసం ఇంటికి నో చాన్స్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఖమ్మంసంక్షేమవిభాగం,ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలోకి దళారులు,పైరవీకారులకు ఇక కళ్లెం పడనుంది. పని ఉన్న వారికే కేఎంసీలోకి ప్రవేశం జరిగేలా కమిషనర్ అభిషేక్ అగస్త్య సంబందిత విభాగాల పర్యవేక్షకులకు, సాంకేతిక నిపుణులకు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వరస కథనాలతో ఒకేరోజు ఆదేశాలు జారీ చేశారు.

ఉద్యోగిని బెదిరించిన వారిపై ఫిర్యాదు

కేఎంసీలోని ఆసరా విభాగంలో శనివారం కొంతమంది వచ్చి అక్కడ పనిచేసే అనిత అనే మహిళా ఉద్యోగిని బెదిరించారు. ఈ సంఘటనను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. సోమవారం ప్రచురితమైన 'కేఎంసీలో దళారుల దాదాగిరి' కథనంపై కమిషనర్ స్పందించారు. ఆ రోజు జరిగిన సంఘటనపై సీసీ కెమెరా వీడియో చిత్రాలను పరిశీలించారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో మహిళా ఉద్యోగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పని ఉన్న వారికే ప్రవేశం

ప్రజాప్రతినిధులు భాగస్వామ్యంతో పాలక వర్గంతో ఉన్న కేఎంసీ పరిపాలన కార్యాలయంలోకి పని ఉన్న వారికే ప్రవేశం జరగనుంది. ఒకే దరఖాస్తును పట్టుకొని గుంపులు గుంపులుగా యువకుల్ని తీసుకొని వచ్చే వారికి ప్రవేశం లేదు. కేఎంసీ ప్రధాన గేటు వద్దనే కార్యాలయంలోకి వచ్చే వారి వివరాలను తెలుసుకొని వారు ఏ పని మీద వస్తున్నారో వివరాలు నమోదు చేసుకొని, వారు ఎక్కడికి వెళ్లాలో స్లిప్ మీద రాసి అవగాహన కల్పించి లోపలికి పంపనున్నారు. కార్పొరేటర్లు,ప్రజాప్రతినిధులు, మీడియాకు మాత్రం ఎటువంటి నిబంధనలు లేవు.

మహిళలకు భద్రత కోసం కమిటీ

కేఎంసీలో మహిళా ఉద్యోగులకు భద్రత, వారికి కావాల్సిన మేరకు మౌళిక సౌకర్యాలు ఏర్పాటుకు ఒక కమిటీని నియామకం చేస్తున్నారు. ముగ్గురు మహిళా గెజిటెడ్ అధికారులతో పాటుగా ఇతర విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులతో కమిటిని ఏర్పాటు చేసేందుకు కార్యచరణ జరిగింది.

విభాగాల వద్ద బందోబస్తు

ఖమ్మంనగర పాలక సంస్థ కార్యాలయంలో ఒక రిసిప్షనిస్టుతో పాటుగా 15 మంది మహిళా సెక్యూరిటీ సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ విభాగం వద్ద సెక్యూరిటీ సిబ్బందిని కేటాయించి ఉద్యోగులకు రక్షణ కల్పించనున్నారు.

బయోమెట్రిక్ హాజరు

ఖమ్మంనగర పాలక సంస్థ కార్యాలయంలో అన్నివిభాగాల్లో కలిపి 1,040 మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. వారిలో 20శాతం మంది ఉద్యోగులు ఎక్కడ పనిచేస్తున్నారో అధికారులకే అంతుచిక్కని పరిస్థితి ఏర్పడింది. వారి ఉద్యోగాల క్రమం తెలుసుకునేందుకు బయోమెట్రిక్ హాజరును ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఆధునిక సాంకేతికత కలిగిన మిషన్లు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రతీ ఉద్యోగికి గుర్తింపు కార్డు

కార్పొరేట్‌స్థాయి కార్యాలయాలు వలే కేఎంసీలో పనిచేసే ప్రతి ఉద్యోగికి ఒక ఐడెండిటీ(గుర్తింపు)కార్డు ఇవ్వనున్నారు. ఉద్యోగ సమయంలో ఖచ్చితంగా ఐడికార్డును మెడలో ఉంచుకొని విధులు నిర్వహించాల్సి ఉంటుంది. గత వారమే కేఎంసీలోని అందరి ఉద్యోగుల ఫోటోలను సేకరించి గుర్తింపు కార్డులను తయారు చేయించారు.

భోజనానికి ఇంటికి.. నో ఛాన్స్

ఉదయం11గంటలకు కేఎంసీ కార్యాలయంలో కొంతమంది ఉద్యోగులు మధ్యాహ్నం 1.30కు భోజనానికి ఇళ్లకు వెళ్లి తిరిగి సాయంత్ర 3.30కు కేఎంసీకి రావటం అలవాటుగా మారింది. ఇటువంటి వారికి ఇకనోఛాన్స్ అని చెప్పాలి. కేఎంసీలోకి ఉదయం 10.30కే బయోమెట్రిక్ హాజరు ద్వారా ప్రవేశం జరిగిన ఉద్యోగి తిరిగి సాయంత్రం విధులు ముగించుకున్న తర్వాతనే బయోమెట్రిక్ హాజరు ముగించుకొని వెళ్లాల్సి ఉంటుంది. అయితే క్షేత్రస్థాయిలో పనులు నిర్వహణ,పర్యవేక్షణకు వెళ్లే అధికారులు, ఉద్యోగులకు మినహాయింపు జరగనుంది.

యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో నెహ్రూ యువ కేంద్రం బ్లాక్ లెవల్ క్రీడాపోటీలను ప్రారంభించారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌వైకే కన్వీనర్ భానుచందర్, ఉదయ్‌కుమార్, వాలీబాల్ కోచ్ అక్బర్ అలీ, ఉమాశంకర్, మనోహర్, సతీష్ పాల్గొన్నారు.

22న హలీం దుకాణ వేలం పాట

ఖమ్మంఖానాపురంహవేలి ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని ఉర్దూఘర్ షాదీఖానాలో హలీం హరీస్ దుకాణం నిర్వాహణకు ఈనెల 22న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఖమ్మం అర్బన్ ఎంఆర్‌ఓ వి రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు అనుసరించి 22న సాయంత్రం 4గంటలకు ఖమ్మం అర్బన్ ఎంఆర్‌ఓ కార్యాలయంలో పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాటలో పాల్గొనే వారు రూ. 5 వేల ముందుగా చెల్లించి పాల్గోనాలని చెప్పారు. పాట ముగిసిన అనంతరం చెల్లించిన డబ్బులను తిరిగి అందజేస్తామని పేర్కొన్నారు.

పెవిలియన్ మైదానంపై పర్యవేక్షణ పెంచాలి

- కమిషనర్‌కు పాలేపు ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున పాలేపు వెంకటరమణ

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి19: (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని పెవిలియన్ మైదానం నిర్వాహణపై పర్యవేక్షణ పెంచాలని,జిల్లా కాంగ్రెస్ నాయకుడు పాలేపు వెంకటరమణ కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు విన్నవించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రం లోనే పెవిలియన్ మైదానానికి ఎంతో ఖ్యాతి ఉందని, ఎన్నో సభలు, సమావేశాలు, అవగాహన సదస్సులు, ఉద్యమాలకు వేదికగా మారిందన్నారు. ప్రస్తుతం ఖమ్మం నగరంలోని క్రీడాకారులు, వాకర్స్‌తో ప్రజాఆకర్షణగా నిలిచిందని తెలిపారు. అటువంటి పెవిలియన్ మైదానంలో కొంతమంది బెట్టింగులు చేస్తున్నారని, అసాంఘీక శక్తులకు అడ్డగా మారటంతో క్రీడాకారులకు వాకర్స్‌కు ఇబ్బంది ఏర్పడిందని ఫిర్యాదు చేశారు. కేఎంసీ, పోలీసు అధికారులు దృష్టి సారించి పెవిలియన్ మైదానం కీర్తిని కాపాడాలని కోరారు.

ఘనంగా ఛత్రపతి శివాజి జయంతి





నేలకొండపల్లిలో శివాజి చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు, ఖమ్మంలో..

నేలకొండపల్లి, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజి మహరాజ్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో నేలకొండపల్లిలో శివాజీ చిత్రపటానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. సాధారణ కుటుంబంలో పుట్టిన, నూనూగు మీసాలొచ్చిన దశలోనే ఓకోటను జయించి తన ధీరత్వాన్ని చూపిన గొప్ప నాయకుడు ఛత్రపతి శివాజీ అని బీజేపీ రాష్ట్ర నాయకుడు భవనాశిదుర్గారావు, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ కొనియాడారు. కార్యక్రమంలో మైనార్టీసెల్ రాష్ట్ర నాయకుడు షేక్. షర్ఫుద్దీన్, నాయకులు సూరేపల్లి జ్ఞానరత్నం, బాజా రామకృష్ణ, నాగాచారి, చక్రపాణి, కల్యాణం నాగేశ్వరరావు నాగరాజు, గిరి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంబైపాస్‌రోడ్: ఖమ్మం 7వడివిజన్ ఖానాపురం సెంటర్‌లో ఉన్న శివాజి విగ్రహం వద్ద ఛత్రపతి శివాజీ మహారాజ్ సంకల్పయాత్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్రనాయకుడు డాక్టర్ శీలం పాపారావు, బీజేపీ అర్బన్ కమిటీ టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాస్,చావా కిరణ్ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన త్యాగనిరతిని కొనియాడారు. ఈకార్యక్రమంలో వేల్పుల సుధాకర్, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, శ్యాంరాథోడ్, పాపారావు, వీరభద్రం, కృష్ణానాయక్, భాస్కర్, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

డీసీసీలో ఎంపీ జన్మదినోత్సవం

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి జన్మదినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వనజీవి రామయ్య విడివిడిగా కేక్‌లు కట్ చేశారు. ఆయన సేవలను కొనియాడారు. మాజీఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మద్దినేని స్వర్ణకుమారి, నగర కాంగ్రెస్ కార్యనిర్వాహణ అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి, కార్పొరేటర్ లకావత్ సైదులునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు కుట్టు మిషన్ల వితరణ

ఖమ్మంస్పోర్ట్స్,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మున్నేరు వరద బాధితుల కుటుంబాల ఆర్థిక చేయూత కోసం నిర్మిణ్ ఫౌండేషన్, హెచ్‌ఎస్‌బీసీ ఐటీ వింగ్ సహకారంతో బుధవారం నగరంలో సుమారు 200 కుట్టుమిషన్లను ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు పంపిణీ చేశారు. మున్నేరు వరద ఎంతో మంది ఇబ్బందులు పడ్డారని వారిని ఆదుకునేందుకు కాంగ్రెస్ యువనేత తుమ్మల యుగంధర్ పిలుపు మేరకు నిర్మాణ్ ఫౌండేషన్, ఐటీవింగ్ సంస్థలు ముందు కొచ్చాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, సతీష్, అఫ్రిన్, సురేష్‌బాబు, అబ్దుల్ ఉన్నారు.

డీఎస్‌వో ఆకస్మిక తనిఖీ

ఖమ్మంరూరల్,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మండలంలో జిల్లా పౌరసరఫరాలశాఖ(డీఎస్‌వో) అధికారి చందన్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ముందుగా జలగంనగర్ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. వరంగల్ క్రాస్‌రోడ్‌లోని రైస్‌మిల్లును తనిఖీచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో నాసిరకం సరుకులు వాడవద్దని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సీఎంఆర్‌ఎఫ్ బియ్యంలో నాణ్యత పాటించాలన్నారు. ఈ తనిఖీలలో సివిల్ సప్లయ్ రూరల్ డీటీ టి. విజయ్‌బాబు, అర్బన్ సివిల్ సప్లయ్ డీటీ మెచ్చు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ సంక్షేమ అధికారుల సంఘం ఎన్నిక



నూతన కార్యవర్గంతో టీఎన్జీవో నాయకులు

ఖమ్మంకలెక్టరేట్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): జిల్లా టీఎన్జీవో అనుబంధ వసతిగృహ సంక్షేమ అధికారుల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా టీఎన్జీవోల సంఘం భవనంలో టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొణిదేన శ్రీనివాస్, వసతిగృహ సంక్షేమ అధికారుల రాష్ట్ర అధ్యక్షులు ఎండి గౌస్ హష్మీ ఆధ్వర్యంలో జిల్లా వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘానికి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా టీఎన్జీవోస్ అసోసియేటెడ్ ప్రెసిడెంట్ కె.దుర్గాప్రసాద్ వ్యవహరించారు. సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కోటపాటి రుక్మారావు, కార్యదర్శిగా నెల్లూరి నాగేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షులుగా బజ్జూరి వెంకటేశ్వరరావు, ట్రెజరర్‌గా కంభం. తిరుపతిరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కె.వీరభద్రరావు, ఎస్.వెంకట్ రెడ్డి, ఎం.కోమలి, జాయింట్ సెక్రటరీలుగా కె.వెంకటేశ్వరరావు, ఆర్. నాగరాజు, పి.మాధురి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సిహెచ్.నాగమణి పబ్లిసిటీ సెక్రటరీ జి.వినోద, స్పోర్ట్స్ సెక్రటరీ ఐ.జ్యోత్స్న ఆఫీస్ సెక్రటరీ టీ.స్టాలిన్, ఈసీ మెంబర్లుగా జి.వెంకటేశ్వర్లు, ఎం.వెంకటకృష్ణ, పి.కృష్ణ కిరణ్, జై.నరసింహారావు ఎన్నికయ్యారు.

ఇసుక అక్రమ రవాణపై చర్యలు

తిరుమలాయపాలెం ఎస్ఐ జగదీష్

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణ చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తిరుమలాయపాలెం ఎస్ఐ కూసుపుడి జగదీష్ తెలిపారు. బుధవారం పోలీసుస్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆకేరు, పాలేరు నదులనుంచి కొందరు ఇసుక వ్యాపారులు ఎటువంటి అనుమతులు లేకుండా ఖమ్మం పరిసర ప్రాంతాలకు ఇసుకను అక్రమంగా సరుఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ఇసుకను అక్రమంగారవాణ చేస్తున్న ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదుచేసినట్టు ఆయన తెలిపారు. మండలంలో పేదలకు అందాల్సిన బియ్యం కూడా అక్రమంగా తరలిస్తున్నారని దీనిపై గట్టి నిఘా పెట్టి బియ్యం తరలించకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి రమేష్

నేలకొండపల్లి,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి):ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగావిఫలమయ్యాయని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ తీవ్రంగా విమర్శించారు. నేలకొండపల్లిలోని బుధవారం యడ్ల తిరుపారావు అధ్యక్షతన జరిగిన పార్టీ మండల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కొప్పుల వెంకట్రామిరెడ్డి, ఏటుకూరి రామారావు, ఇంటూరి అశోక్, రచ్చా నర్సింహారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, రాసాల కనకయ్య, సామాల మల్లికార్జున్,దుగ్గి వెంకటేశ్వర్లు, బలుసు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలను పరిశుభ్రంగా ఉంచాలి

ఏదులాపురం కమిషనర్ షఫీ ఉల్లా

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటి పరిధిలోని అన్ని గ్రామాల్లో డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపాలిటి పరిధిలోని పెద్దతండా,నాయుడుపేట,జలగంనగర్, టీచర్స్ కాలనీ తదితర కాలనీలలో బుధవారం కమిషనర్ పర్యటించారు. డ్రైనేజీలు, వీధులు తదితర వాటిని పరిశీలించారు.తాగునీరు విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. తిరుమలాయపాలేనికి చెందిన బాదావత్ భద్రు(48) వ్యవసాయకూలిగా జీవనం సాగిస్తున్నాడు. ఓ వ్యాధితో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఈనెల 4న పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యంకోసం వరగంల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మరణించాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి బంధులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.జగదీష్ తెలిపారు.

పురోహితులకు పంచాంగం పుస్తకాల బహూకరణ

కారేపల్లి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): కారేపల్లి, కామేపల్లి, రఘునాథపాలెం మండలాల అర్చక పురోహితులకు శ్రీవిశ్వవసు నామ సంవత్సర పంచాంగాలను సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్‌రెడ్డి బహూకరించారు. బుధవారం కారేపల్లి శివాలయంలో జరిగిన కార్యక్రమంలో విజయవిఘ్నేశ్వర అర్చక పురోహితుల సంఘం అధ్యక్షులు కొత్తలంక కైలాసశర్మకు సురేందర్‌రెడ్డి ఈపంచాంగాలను అందజేశారు. గత ఎనిమిదేళ్లుగా పురోహితులకు అందజేస్తున్నట్లు సురేందర్‌రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమంలో అర్చకులు వెలవలపల్లి వెంకటసురేష్‌శర్మ, గణపతిబోట్ల లక్ష్మీనారాయణశర్మ, గోదావరి భువనేశ్వరి ఈశ్వరశాస్త్రి, కొండపల్లిశ్రీనివాస్‌శర్మ, భైరవభట్ల సాయిరాంశర్మ పాల్గొన్నారు.

ఎంజేపీలో భోజనం పరిశీలన

బోనకల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బోనకల్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల బాలుర పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ పున్నం చందర్, ఎంఈవో దామల పుల్లయ్య, గిర్దావర్ గుగులోతు లక్ష్మణ్ పరిశీలించారు. వారంలో ప్రతి బుధవారం పిల్లలతో కలిసి భోజనం చేసే కార్యక్రమంలో భాగంగా మండల అధికారులు గురుకుల పాఠశాలను సందర్శించారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు. మెను ప్రకారం భోజనం అందించడంతో పాటు రుచికరంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగుల ఉధృతి

» ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భద్రునాయక్

తల్లాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నలో కత్తెర, రెక్కల పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందని వీటి నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మొక్కజొన్న పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భద్రునాయక్ సూచించారు. బుధవారం తల్లాడ మండలం గోపాలపేట గ్రామంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి.మల్లయ్యతో కలిసి మొక్కజొన్న పైర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో ఎండీ.తాజుద్దీన్, ఏఈవో హసీనాబేగం పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన నేత 'వేదగిరి'

» సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం



వేదగిరి వర్ధంతి సభలో మాట్లాడుతున్న వీరభద్రం

వైరా, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నిబద్ధత కల్గిన ఆదర్శ కమ్యూనిస్టు నేత, మాజీ ఎంపీపీ వేదగిరి శ్రీనివాసరావు చిరస్మరణీయుడని సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు పేర్కొన్నారు. వైరాలో మంగళవారం రాత్రి జరిగిన వేదగిరి శ్రీనివాసరావు ఐదో వర్ధంతి సభలో ఆయన చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలో అసమానతలు, దోపిడీ, పేదరిక నిర్మూలన కోసం వేదగిరి చేసిన పోరాటాలను వారు గుర్తు చేసుకున్నారు. మాజీ ఎంపీపీ బొంతు సమత, వేదగిరి సతీమణి కళావతి, నాయకులు సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, పారుపల్లి కృష్ణారావు పాల్గొన్నారు.



కల్లూరు కుమ్మరికుంట చెరువులో అడుగంటిన నీరు



వరి కంకి పాలు పోసుకుంటున్న దృశ్యం

యాసంగికి నీటి ఎద్దడి

» చెరువులు, కుంటల్లో అడుగంటుతున్న నీరు
» సాగునీటికి పెరిగిన డిమాండ్
» పొట్టదశలో వరిపైరు..
» తూముల ద్వారా పంట కాల్వలకు అందని సాగునీరు
» సాగర్ నీటితో చెరువులను నింపాలంటున్న రైతులు

కల్లూరు, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): పక్షం రోజుల నుంచి పగటి పూట ఉష్ణోగ్రతలు విపరింతంగా పెరిగినాయి. చెరువులు, కుంటల పరిధిలో యాసంగిలో సాగు చేసిన వరి పైరుకు సాగునీటి డిమాండ్ అధికంగా పెరిగింది. కల్లూరు మండలంలో ప్రధాన జలసిరులైన చెరువులు, కుంటల్లో ఉన్న నీరు అడుగంటుతున్నాయి. వరి పైరు కంకి పాలు పోసుకోవటం, పొట్ట దశలో ఉంది. సాగర్ కాల్వ ద్వారా సాగు నీరు పారుదల అవుతున్న వారబందిపై సరఫరా చేయటంతో అరకొరగా సాగునీరు అందటంతో సాగునీటికి గడ్డుకాలం దాపురించింది. ఈ పరిస్థితి దృష్ట్యా మండలంలోని పలు గ్రామాల రైతులు దిగాలు పడ్డారు. ఇప్పటికే మండలంలోని లోకవరం పెద్దచెరువు, కల్లూరులో కుమ్మరికుంట, గోపాలకుంట, ఇటుకరాళ్ల చెరువు, పెద్దకోరుకొండి, వెన్నవల్లి, పాయాపూరు, వైస్‌పురం, ముచ్చవరం తదితర గ్రామాల్లో చెరువులు, కుంటల్లో ఉన్న నీరు అడుగంటినాయి. దీంతో వాటి పరిధిలో గల తూముల ద్వారా సాగునీరు చివరి భూములకు పారుదల కావటం కష్టా సాధ్యంగా మారింది. మండలంలో సాగర్ జలాలు ద్వారా నిరంతరాయంగా సాగు నీరు అందిస్తే చెరువులు, కుంటల్లో నీరు అడుగంటే అవకాశం ఉండకపోయేది. మండలంలో చెరువులు, కుంటల కింద 15 వేల ఎకరాల వరి పైరు సాగుబడి అవుతుంది. సాగర్ కాల్వ పరిధిలో మరో 18 వేల ఎకరాలు ఆయకట్టు విస్తరించి ఉంది. చెరువులు, కుంటల్లో నీరు అడుగంటంతో పంట పోలాలకు సాగునీరు అందక వరికి నష్టం జరిగి దిగుబడి తగ్గుతుందని పలు గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపున చెంతనే సాగర్ నీరు పారుదల అవుతున్న జలవనరులశాఖ అధికారులు (కాల్వపై ఎగువన గల) కల్లూరు మండలంలోని పలు గ్రామాల చెరువుల తూములకు సాగర్ నీరు అందనీయకుండ వాటి తూములను మూసి వేయించటంతో నీరు చేరక అడుగంటే పరిస్థితి నెలకొన్నదని రైతులు వివరించారు.

చెరువులు, కుంటలు నింపాలి

కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో గల చెరువులు, కుంటల్లో నీరు అడుంటి నందున సాగర్ నీటిని మళ్లించి వాటిని నింపాలని పలు గ్రామాల రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. యాసంగిలో సాగు చేసిన వరి పైరు కంకి పాలు పోసుకొని పోట్టదశలో ఉందని ఈ సమయంలలో సాగునీటి తడులు అందించాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు. ఇప్పటికే లోకవరం పెద్దచెరువులో నీరు అడుగంటంతో ఉన్న నాలుగు తూముల నుంచి పంట కాల్వల ద్వారా సాగునీరు అందటం ప్రశ్నార్థకంగా మారింది. వరి పైరుకు ఈ పరిస్థితుల్లో సాగునీటికి డిమాండు ఉంది. సాగర్ క్వాల నీటిని చెరువులు, కుంటల్లోకి మళ్లించి వాటిని నింపాల్సిన అవసరం ఉందంటున్నారు.

సాగర్ జలాలను విడుదల చేయాలి

ఎర్రుపాలెం, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టలేరు ప్రాజెక్టు కింద వేలాది ఎకరాలలో వరి, మొక్కజొన్న పంట పొలాలు నీరు లేక ఎండిపోతున్నాయని సాగర జలాలను వెంటనే విడుదల చేయాలని సీపీఎం రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య డిమాండ్ చేశారు. మండలంలోని మామునూరు గ్రామంలో నీరు లేక ఎండిపోతున్న మొక్కజొన్న, వరి పొలాలను పార్టీ బృందం బుధవారం పరిశీలించారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్, గొల్లపుడి పెద్ద కోటేశ్వరరావు, రైతులు కన్నెబోయని శ్రీనివాసరావు, గొల్లపుడి హరినారాయణ, బాపయ్య పాల్గొన్నారు.

మట్టి తోలకాలపై విచారణకు ఆదేశం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

బోనకల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో గల భూముల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ మట్టిని తెగ తోడేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆర్డీవో స్పందించారు. విచారణ నిర్వహించిన నివేదిక సమర్పించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. లక్ష్మీపురం, చిరునోముల రెవెన్యూ పరిధిలో గల భూముల్లో ఎర్రమట్టి నిల్వలు ఉండటంతో అక్రమ తోలకాలు జరగకుండా పూర్తిగా పర్యవేక్షించాలని కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రతిరోజు మట్టి తోలకాలు నిర్వహించే ప్రాంతం వద్ద పంచాయతీ సిబ్బంది ఉండి పర్యవేక్షించాలని, అక్రమ తోలకాలు జరిపే ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేయాలని పేర్కొన్నారు. ప్రతి వారం మట్టి తోలకాల భూముల వద్దకు గిర్దావర్లు వెళ్లి పర్యవేక్షించాలని, అక్రమ తోలకాలకు అడ్డుకట్ట వేయాలని స్పష్టం చేశారు. అక్రమ మట్టి తోలకాలను కట్టడి చేసేందుకు గానూ పకడ్బందీగా పర్యవేక్షణ చేసి అన్ని రకాల చర్యలు తీసుకోనున్నట్లు తహసీల్దార్ పున్నం చందర్ తెలిపారు.

డిజిటల్ పంట నమోదు ప్రారంభం



పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ

మధిరటౌన్, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అధికారులు రబీ పంటలను డిజిటల్ విధానంలో మధిరలో చేపట్టిన పంట నమోదు ప్రక్రియను బుధవారం మధిర వ్యవసాయ సహాయ సంచాలకుడు విజయచంద్ర పరిశీలించారు. పంట నమోదు పకడ్బందీగా చేస్తే రేపు రైతు తమ పంటను అమ్ముకునేటప్పుడు ఎటువంటి సమస్యలు, ఇబ్బందులు ఎదురవ్వవని అన్నారు. రైతులు కూడా పంట నమోదు చేసేటప్పుడు వారు సాగుచేసే భూములు వద్దనే ఉంటే వ్యవసాయ విస్తరణ అధికారులు ఎటువంటి పొరపాట్లు చేసేందుకు వీలు ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాయిదీక్షిత్, విస్తరణ అధికారులు అమృత, జిష్ణు రైతులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పన్నుల వసూళ్లు



ఇంటిపన్ను రసీదు అందజేస్తున్న కమిషనర్ వేణు

వైరా, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలో బుధవారం ముమ్మరంగా పన్నుల వసూళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ చింతా వేణు ఆధ్వర్యంలో వార్డు ఆఫీసర్లతో కూడిన బృందాలు వార్డుల వారీగా ప్రత్యేకంగా పన్నుల వసూళ్లు చేపట్టారు. ఇప్పుడు పన్నులు చెల్లిస్తే ఏప్రిల్ తర్వాత ఐదుశాతం రాయితీ వస్తుందని, అందువలన సకాలంలో పన్నులు చెల్లించి మునిసిపాలిటీ అభివృద్ధికి తోడ్పాటునందించాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఎంపీ రామసహాయం జన్మదినం



సత్తుపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్/ వైరా/ కల్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డి పుట్టిన రోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి హాజరై కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. పలువురు దాతలు కుర్చీలను ఎమ్మెల్యేకు వితరణగా అందజేశారు. అనంతరం సొసైటీ పాలకవర్గాలను మరో ఆరు నెలల పాటు పొడిగించిన సందర్భంగా సత్తుపల్లి పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు తుమ్మల, పొంగులేటి, భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలపై స్థాయి మరిచి అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి తీరుపై సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి మండిపడ్డారు. ప్రజలు మెచ్చి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజారంజక పాలన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై చేస్తున్న వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.

● వైరా మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గరిడేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో బుధవారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి జన్మదిన వేడుకలను వేర్వేరుగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణి చేశారు. ధార్న రాజశేఖర్, జాలాది రామకృష్ణ, రేచర్ల సత్యం, పోలా శ్రీనివాస్, ధార్న వెంకటేశ్వరరావు, రామారావు, సైదులు, భాస్కర్, చిన్నరాములు, వెంకట్, వేముల శ్రీనాథ్, దేవళ్ల సాయికిరణ్ పాల్గొన్నారు.

● కల్లూరు మండలంలోని నారాయణపురం గ్రామంలో బుధవారం ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా రెవిన్యూ మంత్రి శ్రీనివాసరెడ్డి సోదరుడు, కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి కేక్ కట్ చేసి ఎంపీ రాఘురాంరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి ఎంపీ రఘురాంరెడ్డి మరింతగా పాటుపడాలని ప్రసాదరెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమలో కాంగ్రెస్ నాయకులు కీసర వెంకటేశ్వరరెడ్డి, మట్టా రామకృష్ణ, యాసా శ్రీకాంత్, నోటి కృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో సంబరాలు నిర్వహిస్తున్న నాయకులు

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

సత్తుపల్లిరూరల్/ చింతకాని, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అమ్మమాట కోసం హైందవ సామ్రాజ్యాన్ని స్థాపించిన ఘనత ఛత్రపతి శివాజీకే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ రమేష్ అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా బుధవారం మెట్టాంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి రింగ్ సెంటర్ మీదుగా పట్టణంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

ఛత్రపతి శివాజీ జన్మదిన వేడుకలను చింతకాని మండలంలోని నాగులవంచ గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు కొండా గోపి ఆధ్వర్యంలో యువకులు శివాజీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి పూలమాలతో నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల సందర్భంగా కల్లూరులో బుధవారం విశ్వహిందు పరిషత్, శివాజీ యువసైన్యం, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

రవీందర్ విజయానికి సహకరించాలి

తల్లాడ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం జాక్టో బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ విజయానికి సహకరించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. పర్వతరెడ్డి కోరారు. బుధవారం తల్లాడలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లాప్రధాన కార్యదర్శి షేక్ కరామత్‌హలీ, చిరంజీవులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి స్థలం

వైరా, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలోని హనుమాన్ ఆలయ సమీపంలోగల పురాతన ముత్యాలమ్మ దేవాలయం నిర్మాణానికి వైరాకు చెందిన సూర్యదేవర వెంకటకృష్ణ 700గజాల స్థలాన్ని దానం చేశారు. తన సోదరుడు శ్రీమంత్‌తో కలిసి వారి పొలంలోని 700గజాల స్థలంలో ముత్యాలమ్మ దేవాలయ నిర్మాణానికి స్థలాన్ని దానం చేస్తున్నట్లు ప్రకటించారు.

విద్యతోనే బంగారు భవిత

వైరా, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే బంగారు భవిష్యత్ సిద్ధిస్తుందని డిస్ట్రిక్ట్ ఫాస్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని ఖానాపసురం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు చొరవతో దాతలు కొణతాలపల్లి వేణు, షేక్ లాల్ అహ్మద్ మరికొంతమంది దాతలు సమకూర్చిన రూ.20వేల విలువైన వాటర్ కూలర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కిలారు శ్రీనివాసరావు, జీఎస్టీ కోఆర్డినేటర్ ఉంద్రు శ్యాంబాబు, అబ్బూరి రమేష్, మరికంటి రాంగోపాల్, నాగేశ్వరరావు, కృష్ణార్జున్‌రావు, వై.బుచ్చిరామారావు పాల్గొన్నారు.

ఆంబోతుకు అంత్యక్రియలు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాతలకుంటలో బుధవారం ఆంబోతు మృతిచెందగా గ్రామస్థులు ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. పూలమాలతో అలంకరించిన ట్రాక్టర్‌పై గ్రామవీధుల్లో ఊరేగించారు. బాణసంచా కాలుస్తూ, నృత్యాలు, మేళతాలలతో ఊరేగింపు నిర్వమించారు.

అల్పాహారానికి ఆర్థికసాయం

వైరా, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరికపాడు హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం కోసం అదే గ్రామానికి చెందిన అయిలూరి సత్యనారాయణరెడ్డి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. బుధవారం ప్రధానోపాధ్యాయుడు దొంతెబోయిన సత్యనారాయణకు నగదును సత్యనారాయణరెడ్డి అందజేశారు.

వాటర్ ట్యాంకు ప్రారంభం

వైరా, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల(జీజేసీ)లో కొప్పురావూరి పురుషోత్తమరావు జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ప్రిన్సిపాల్ నవీన జ్యోతి బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తమరావు సతీమణి లక్ష్మి, కుమారుడు రఘువీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వానరాలకు పండ్లు పంచిన ఏసీపీ

పెనుబల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాద్రీశ్వరస్వామి ఆలయ సమీపంలో వానరాలకు అరటి పళ్లను వైరా ఏసీపీ ఎంఏ రెహ్మాన్ బుధవారం అందజేశారు. అటవీ ప్రాంతంలో ఆహారం దొరక్క మూగజీవాలు అలమటించటంతో ఏసీపీ అరటిపళ్లను అందించారు. గతంలోనూ ఈ ప్రాంతంలో మూగజీవాలకు ఆహారాన్ని అందించినట్లు ఏసీపీ తెలిపారు.



సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్

» ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఏన్కూరు/ కారేపల్లి, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్యదైవం శ్రీసంత్‌సేవాలాల్ అని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అన్నారు. హిమాంనగర్, కారేపల్లిలో బుధవారం సేవాలాల్‌జయంతి వేడుకలు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భోగ్‌భండారో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బంజార జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. బంజారా జాతి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క గిరిజనుడిపై ఉందన్నారు.

మోడల్ స్కూల్ తనిఖీ

పెనుబల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకులపల్లి ఆదర్శ పాఠశాలను డీఈవో సోమశేఖరశర్మ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలను రాబట్టారు. సాధారణ, పోటీ పరీక్షల్లోనూ మానసికంగా, దృఢంగా సిద్ధం కావాలని సూచించారు. పలు పాఠ్యాంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లాస్థాయిలో పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఎకరాకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

చింతకాని, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అమరావతి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని కొదుమూరు గ్రామంలో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డీవో నరసింహారావు సమావేశం ఏర్పాటు చేశారు. రైతుల పక్షాన సీపీఐ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు మాట్లాడారు. మార్కెట్ ధర ప్రకారం రైతులకు రూ. 50 లక్షల ఇవ్వాలని, పొలాలకు వెళ్లడానికి సర్వీసు రోడ్డు, పొలాల్లోని వృక్ష సంపదకు దీర్ఘకాలిక పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బడికి రూ.50వేల సామగ్రి వితరణ

వైరా,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): కొత్తగూడేనికి చెందిన సింగరేణి కాలరీస్ పద్మావతి-5ఇంక్లైయిన్ యూనియన్ ఖని ఏజెంట్ రవీందర్, మేనేజర్ శ్యాంప్రసాద్, వెల్ఫేర్ ఆఫీసర్ షకీల్ ఆధ్వర్యంలో వైరా మండలంలోని పాలడుగు హైస్కూల్‌కు రూ.50వేల విలువైన సామగ్రిని బుధవారం అందజేశారు. షకీల్ మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ యూనియన్ సభ్యుల నుంచి సేకరించి విరాళాలను సామగ్రి అందిస్తున్నామని తెలిపారు. పాలడుగు హైస్కూల్ పూర్వ విద్యార్థులు మోదుగు వినోద్‌కుమార్, కాకాణి శ్రీవాణి పదో తరగతి విద్యార్థులకు అల్పాహారాన్ని అందజేశారు.